PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 01.11.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 22 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ఆంధ్ర సమస్య పరిష్కారానికి...


# అధిష్టానానికి దారేది

సరికొత్త డ్రామాకు తెరలేవనుందా
తెలంగాణ అంశానికి తెరపడనుందా
కాంగ్రెస్ ప్లేటు ఫిరాయించబోతుందా
కిరణ్‌ను హీరోను చేయబోతుందా
సీమాంధ్రలో ప్రయోజనం కోసం ప్రయత్నిస్తోందా
ఆర్టికల్ 371(డి) అడ్డు తగిలిందా ?

రాష్ట్ర విభజన నాటకం సరికొత్త మలుపులు తిరగబోతుందా? నమ్మించి నట్టేట ముంచుతుందనే పేరు బడ్డ కాంగ్రెస్ తెలంగాణను మరోసారి అదేవిధంగా చేయబోతుందా? జరుగుతున్న పరిణామాలు దేనికి సంకేతం? రాష్ట్ర విభజనతో విచ్ఛిన్నశక్తులు బలపడే ప్రమాదముందన్న టాస్క్‌ఫోర్స్ అభిప్రాయం దేనికి సూచిక... ఆర్టికల్ 371(డి)కి రాజ్యాంగ సవరణ చేయనిదే రాష్ట్ర విభజన కుదరదన్న కేంద్ర హోంశాఖ ప్రకటన ఏ వాతావరణాన్ని సూచిస్తుంది. మళ్ళీ అఖిలపక్షం ఏర్పాటు చేయాలన్న కేంద్రం నిర్ణయం ఏం నిర్దేశించబోతుంది? కేంద్రం తెలంగాణపై ముందుకుపోతున్నదనడానికి సంకేతమా? లేక తెలంగాణపై యూటర్న్ తీసుకోనుందని సందేహం రేపడమా?

రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ అధిష్టానం ధోరణిలోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణ సమస్య ఆ పార్టీని విలన్‌గా నిలబెట్టింది. తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇచ్చిన పార్టీలు కూడా కాంగ్రెస్‌నే నిందించడం మొదలుపెట్టాయి. తెలంగాణపై తీసుకున్న నిర్ణయంతో కాంగ్రెస్ స్థాయి కూడా దిగజారింది. తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా వున్న బీజేపీ కూడా రాష్ట్రాన్ని విభజించే పద్ధతి ఇదికాదంటూ కాంగ్రెస్‌ను పదేపదే దెప్పిపొడవసాగింది. యూపీఏలోని కొన్ని మిత్రపక్షాలు కూడా ఈ విషయంలో కాంగ్రెస్ ఏకపక్ష నిర్ణయాన్ని తప్పుబట్టాయి.

ఇక రాష్ట్రంలో పరిస్థితులుచూస్తే కాంగ్రెస్‌కు ఆశాజనకంగా లేవు. తెలంగాణకు అనుకూలంగా లేఖలిచ్చిన తెలుగుదేశం, వైకాపాలు కాంగ్రెస్‌పైనే దుమ్మెత్తి పోస్తున్నాయి. మేం ఏకపక్ష విభజన కోరలేదని, సమన్యాయం చేయమంటున్నామని తెలుగుదేశం అంటుంటే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సమైక్యాంధ్రవాదం వైపు యూటర్న్ తీసుకుంది. ఇంతేకాదు, సీమాంధ్రలోని కాంగ్రెస్ నాయకులే అధిష్టానానికి అడ్డం తిరిగారు. తెలంగాణపై తమ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని సాక్షాత్తూ ఆ పార్టీ ముఖ్యమంత్రే తప్పుబట్టారు. ఇక ఎంపీలు, ఎమ్మెల్యేలు అడ్డం తిరగడం తెలిసిందే! రాష్ట్ర విభజన నిర్ణయంతో సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ సర్వనాశనం అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. సీమాంధ్రలోని 5కోట్లమంది (మిగతా 5వ పేజీలో)




కాంగ్రెస్-వైయస్సార్ కాంగ్రెస్‌ల మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ కుదిరిందనే అనుమానాలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలను ఊపేస్తున్నాయి.

## వైయస్సార్... కాంగ్రెస్

# అనుమానం పెనుభూతమౌతోంది

ప్రజల్లో ప్రభంజనంగా వున్న జగన్ ఇమేజ్‌పై కాంగ్రెస్-వైయస్సార్ కాంగ్రెస్‌ల మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ ప్రచారం ప్రభావం చూపుతోంది. కాంగ్రెస్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుంటే 16నెలలు జైల్లో ఉండాల్సిన అవసరమేముంది అని జగన్ వివరణ ఇచ్చినా, జరుగుతున్న పరిణామాలు మాత్రం మ్యాచ్‌ఫిక్సింగ్‌పై అనుమానాలను బలపడేలా చేస్తున్నాయి. ఒకరకంగా కాంగ్రెస్‌వాళ్లే జగన్‌ను బలహీన పరచడానికి ఈ విధంగా చేస్తున్నారనే అనుమానాలు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ అధిష్టానం (మిగతా 10వ పేజీలో)









PDF Compressor Free Version





# కాలువలు పునర్నిర్మిస్తే...

# డ్రైనేజీ సమస్యకు నమస్తే పెట్టొచ్చు!

**నెల్లూరు నగరానికి మొదటినుండి డ్రైనేజీ పెద్దసమస్యగా వుంది. చాలా ఏళ్లక్రితం ఏర్పాటు చేసిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఇప్పటి అవసరాలకు ఉపయోగపడడంలేదు. నగరం బాగా విస్తరించింది. ఎక్కడికక్కడ లేఅవుట్లు వచ్చాయి. అయితే ఎక్కడా సరైన డ్రైనేజీ సిస్టమ్ లేదు.**

నెల్లూరులో మురుగునీటి పారుదలకు ప్రధాన ఆధారం ఒకప్పటి పంటకాలువలే! నెల్లూరుచెరువు నుండి 8 పంటకాలువలు నగరంలో ప్రవహిస్తూ తూర్పువైపు శివార్లలో పొలాలకు నీళ్లందిస్తుంటాయి. నగరం విస్తరించి, వ్యవసాయ పొలాలు లేఅవుట్లుగా మారినా కూడా ఇప్పటికీ కనుపర్తిపాడు, ధనలక్ష్మీపురం ప్రాంతాల్లో వున్న పొలాలకు ఈ కాలువల ద్వారా సాగునీళ్లు వెళు తున్నాయి. కొన్నికాలువలు పూర్తిగా డ్రైనేజీ కాలువలుగా మారిపోగా కొన్ని కాలువలు డ్రైనేజీ కమ్ సాగునీటి పారుదల కాలువలుగా వున్నాయి. నగరంలో ఈ పంటకాలువలు ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. కొన్నిచోట్ల కాలువలను పూడ్చేసి అక్రమనిర్మాణాలు చేసారు. బాలాజీనగర్, ఏ.సి.నగర్ ప్రాంతాల్లో చూస్తే ఎంతో పెద్దగా వున్న కాలువలు ఇక్కడ సన్నగా కనిపిస్తాయి. అక్కడ కొద్దిదూరం పోయాక ఆ సన్నకాలువ కూడా కనిపించదు. పంటకాలువలను ఇరువైపులా ఆక్రమించేసి నిర్మాణాలు చేసినందువల్ల ఈ కాలువల్లో పూడికతీసే దానికి కూడా అవకాశం లేకుండాపోయింది. దీంతో ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. ఈ మురుగుకాలువలే దోమల ఉత్పత్తికేంద్రాలవుతున్నాయి. సకలరోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఇక వర్షకాలంలో చూస్తే ఈ కాలువల్లో మురుగు నిండి వుంటుంది... వర్షపునీళ్లు పోవడానికి అవకాశముండదు. నగరంలో కురిసే వర్షంనీళ్ళన్నీ ఈ కాలువల ద్వారా పోవాలి. ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోయినందువల్లే డ్రైనేజీ పొంగి రోడ్లమీద ప్రవహిస్తూ ఉంటుంది. వర్షాకాలంలో నెల్లూరురోడ్లు డ్రైనేజీ కాలువలుగా మారడం మనం చూస్తూనే వున్నాం.

నగరంలో డ్రైనేజీ వ్యవస్థను బాగుపరచాలంటే ముందుగా కాలువల కిరువైపులా వున్న ఆక్రమణలు గుర్తించాలి. ఆక్రమణలను తొలగించి, ప్రతి కాలువకు అవుట్‌లెట్ ఏర్పాటు చేయాలి. ప్రతికాలువలో పూడికతీయాలి. మళ్ళీ మళ్ళీ కాలువలు ఆక్రమణలకు గురికాకుండా నగరపాలక సంస్థ అధికారులు గట్టిచర్యలు చేపట్టాలి. చిత్తశుద్ధితో చేయాలనుకుంటే ఇదేమంత కష్టం కాదు!




# పైరుకు సిద్ధమవుతున్న జీళ్ళు

జిల్లాలో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలు లేకపోయినా ఎగువప్రాంతాల్లో కురిసిన వర్షాలతో నీటికరువు తీరబోతుంది. జిల్లా రైతాంగ వరప్రసాదిని సోమశిల రిజర్వాయర్ పూర్తి సామర్థ్యానికి చేరువైంది. నవంబర్ నెలలో ఇంకా వర్షాలు కురిసే అవకాశముండడంతో ఈసారి పంటలకు కరువు తీరినట్లే. తాగునీటికి కూడా ఢోకాలేదు.

గత కొన్నేళ్లుగా సోమశిలకు కృష్ణ నీళ్లే దిక్కవుతున్నాయి. పెన్నానదికి వరదలొచ్చి చాలాకాలమవుతుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుండి వదులుతున్న కృష్ణ నీళ్లతోనే సోమశిలను నింపాల్సి వస్తుంది. అసలు కృష్ణా నీళ్లే లేకపోతే పెన్నాడెల్టా రైతాంగం పరిస్థితే చాలా ఆందోళనకరంగా వుండేది. ఈ ఏడాది కూడా సోమశిలను కృష్ణ నీళ్లు ఆదుకున్నాయి. సోమశిల పూర్తి సామర్థ్యానికి చేరడంతో ఇరిగేషన్ అధికారులు కండలేరు జలాశయం నింపడానికి సన్నాహాలు చేస్తున్నారు. కండలేరులో 66టీఎంసీల నీటిని నిల్వచేయనున్నారు. కండలేరు నుండి చెన్నైకి 12టీఎంసీల నీటిని విడుదల చేస్తారు. మొత్తానికి జిల్లాలో కుండపోత వర్షాల్లేనప్పటికి అన్నదాతకు గుండెకోత లేకుండా రిజర్వాయర్లు నిండడం ఆనందించాల్సిన విషయమే.

## వైకాపా శ్రేణుల్లో...



# సమరోత్సాహం

హైదరాబాద్‌లో జగన్ నిర్వహించిన సమైక్యశంఖారావం సభకు భారీగా జనం తరలిరావడం వైయస్సార్ కాంగ్రెస్ శ్రేణులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. ఎన్నికలకు ముందు ఈ సభ సక్సెస్ కావడం కార్యకర్తలకు, నాయకులకు జీవన్ టోన్ టానిక్‌లా ఉపయోగపడబోతుంది. భారీవర్షాలను సైతం లెక్కచేయకుండా ప్రజలు భారీగా తరలిరావడంతో జగన్ నాయకత్వంపై నాయకులు, కార్యకర్తలకు మరింత నమ్మకం పెరిగింది.

నెల్లూరుజిల్లాలో తొలిసారిగా వైకాపాశ్రేణులు ఒకేతాటిమీదకొచ్చి ఉత్సాహంగా పనిచేసిన సందర్భం కూడా నిన్నటి సమైక్యశంఖారావం సభలోనే కనిపించింది. జిల్లా నుండి ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఒక రైలుతో పాటు వందలాది బస్సులు, టెంపోలు, కార్లు వంటి వాహనాలలో భారీగా తరలివెళ్లారు. ఒక్క నెల్లూరుజిల్లా నుండే 15నుండి 20వేల మంది దాకా వెళ్లివుంటారని అంచనా! జనాన్ని తరలించ డంలో నెల్లూరురూరల్, సిటీ సమన్వయకర్తలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు తీవ్రంగా శ్రమించారు. సర్వేపల్లి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి నుండి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోవూరు నుండి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భారీగానే జనసమీకరణ చేసారు. రిజర్వుడ్ నియోజకవర్గాలైన గూడూరు, సూళ్లూరుపేటల నుండి కూడా సీట్ల పోటీలో వున్న సమన్వయకర్తలు ఈ సభ కోసం బాగానే కష్టపడ్డారు.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్థాపించినప్పటి నుండి జిల్లాలో వర్గపోరు అధికంగా వుంది. పార్టీపై తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి మేకపాటి సోదరులు చేసిన కొన్ని అనవసర ప్రయత్నాల వల్ల పార్టీలో గ్రూపు రాజకీయాలు నడిచాయి. వాస్తవంగా చూస్తే మేకపాటి సోదరులకు అవి అనవసరం! అందరినీ కలుపుకుపోయే ప్రయత్నం చేసివుంటే ఏ సమస్యా వచ్చేదికాదు. చాలారోజుల తర్వాత వర్గవిభేదాలను పక్కనపెట్టి ఆ పార్టీ నాయకులంతా సమైక్య శంఖారావం సభ కోసం పనిచేయడం విశేషం.

# పదవులే కాదు... టిక్కెట్లు కూడా ఫ్రీ

**పదిహేనేళ్ల క్రితం మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డికి పీసీసీ కార్యవర్గంలో సభ్యుడిగా పదవి వచ్చింది. ఆ పదవి వచ్చినందుకు ఆయనకు నెల్లూరు టౌన్‌హాల్‌లో భారీ అభినందనసభ నిర్వహించారు. ఆ రోజుకు ఆయన మాజీఎమ్మెల్యే, ప్రజలలో గుర్తింపు పొందిన నాయకుడు. ఆయనకే పీసీసీ కార్యవర్గసభ్యుడి పదవి రావడం చాలా గొప్ప విషయంగా భావించారు. అప్పటికి కాంగ్రెస్‌పార్టీ ప్రతిపక్షంలోనే ఉండింది. అయినా కూడా కాంగ్రెస్‌పార్టీ పదవులకు అంతటి విలువ వుండేది.**

మరి ఇప్పుడు చూస్తే... అడగాలేగాని ఎలాంటి తలమాసినోడికైనా పీసీసీ అధ్యక్షపదవిని కూడా పడేసేటట్లున్నారు. కాంగ్రెస్ పదవులు అంత చీపైపోయాయి. పదవులే కాదు, కాంగ్రెస్‌పార్టీ కూడా చీపైపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఏ దుస్థితిలో వుందో ఇటీవల ఆ పార్టీ పదవుల పంపకమే నిరూపిస్తుంది. పార్టీకి ఏ మాత్రం సంబంధంలేని వారికి, పార్టీ కోసం అంతగా పని చేయని వారికి కూడా ఒక స్థాయి కలిగిన పదవులిచ్చారు. రాష్ట్రంలో అంతగా బలంలేని బీజేపీ అయినా కొంత సామర్థ్యంగల నాయకులకు పదవులిస్తుంది. కాని ఇప్పుడు కాంగ్రెస్ దానికన్నా ఘోరంగా తయారైంది. ఇప్పుడు పదవుల పంపకమే ఇంత అధ్వాన్నంగా వుంటే రేపు టిక్కెట్ల పంపకం ఎలా వుంటుందో? 2009 ఎన్నికల వరకు కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్ తెచ్చుకోవడమంటే యూరోలాటరీ విజేతగా నిలిచినట్లుండేది. పీసీసీ అధ్యక్షుడిగా వున్న ఓ నాయకుడు టిక్కెట్లు అమ్ముకోవడం, కోట్లు పెట్టి అభ్యర్థులు కొనడం జరిగింది. గత ఎన్నికలవరకు కాంగ్రెస్ టిక్కెట్లకు అంత డిమాండ్ ఉండేది. మరి రేపటి (మిగతా 10వ పేజీలో)

# వ్యర్థంతో అనర్థం!



▶ పెన్నానదిలోకి డ్రైనేజీనీళ్ళు, మురుగునీరు, చెత్తాచెదారం

▶ తాగునీరు కలుషితం... పంటపొలాలు విషపూరితం

*పవిత్రమైన పెన్నానది డ్రైనేజీ నీళ్ళు, మురుగునీరు, చెత్తాచెదారంతో కలుషితమై మురికికూపంగా మారిపోయింది. దీంతో తాగునీరు కలుషితమై విషపూరితమవుతున్నాయి. ఉత్తరదిశలో పవిత్ర పినాకినీ నదిగా పేరు ప్రఖ్యాతులున్న పెన్నానది నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ వారికి చెత్తాచెదారం నింపుకొనే డంపింగ్‌యార్డుగా మారిపోయింది.*

ప్రతిరోజూ టన్నులకొద్దీ చెత్తాచెదారాలను బోడిగాడితోటను ఆనుకుని ఉన్న పెన్నానదిలోకి వదులుతున్నారు. దీంతో మురిగిపోయిన చెత్తాచెదారాలు నది నీటిని విషపూరితం చేస్తోంది. దీంతో నేరుగా నదిలోకి వస్తుండటంతో నీరు కాలుష్యానికి గురవుతోంది. నెల్లూరు నగరానికి తాగునీటిని అందించే పాతపెద్దాసుపత్రి ప్రాంతంలోని నదిలో ఉన్న వాటర్‌పంపింగ్ సిస్టం ఉన్న ప్రాంతంలో కూడా చెత్తాచెదారాలతో పాటు మురుగునీరు వదులుతున్నారు. దీంతో ఈ ప్రాంతం కూడా విషపూరితం అవుతోంది. తాగునీరు కలుషితం అవుతుండడంతో నగరప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నదినీరు పంటపొలాలను నిర్వీర్యం చేయడమేగాక పంటలను విషపూరితం చేస్తున్నాయి. గతంలో ఢిల్లీ నుంచి వచ్చిన నిపుణుల బృందం పెన్నా నీటిని పరీక్షించి నీటిలో అధిక మోతాదులో ప్రమాదకరస్థాయిలో కలుషిత పదార్థాలు ఉన్నాయని నిర్ధారించింది. నది నీరు కలుషితం కాకుండా బయటే శుద్ధిచేసేందుకు రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటుచేయాలని కమిటీ సూచించింది. రోజురోజుకు ఆక్రమణలతో పెన్నానది కుచించుకుపోతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించడంతో పాటు నదీజలాల శుభ్రతపై దృష్టిపెట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

PDF Compressor Free Version



## నేనేం పాపం చేసానో...
# దీపం వెలిగించలేకపోయా!

నేను ఏం పాపం చేసానోగాని గత ఏడాది కార్తీకమాసంలో మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీపం వెలిగించలేకపోయానని నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి తెగ బాధపడ్డారు. బుధవారం నెల్లూరు మూలాపేటలో మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది అనారోగ్యం కారణంగా కార్తీక దీపం వెలిగించలేకపోయానని, ఈ సంవత్సరం మాత్రం ఆ పరమేశ్వరుడు దీపం వెలిగించే అవకాశం ఇచ్చాడన్నారు. ఈ నెల 4నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు జరుగుతాయని చెప్పారు. నగరంలోని నవాబుపేట, ఉస్మాన్‌సాహెబ్‌పేట, సంతపేట శివాలయాలతో పాటు శ్రీరాజరాజేశ్వరి దేవస్థానంలో కూడా ఇదే రీతిలో కార్తీక మాసోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో నగరఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డీసీసీ ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు చాట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం
# వేమిరెడ్డి శ్యామలమ్మ



దైవలీల విచిత్రమైనది. మనిషికి ఆనందం, విషాదం వెనువెంటనే ఇచ్చి తానున్నానని రుజువు చేసుకోవడమే దేవుడి పని. మూడురోజుల పాటు బృహత్తర కార్యక్రమాలను నిర్వహించి విపిఆర్ కన్వెన్షన్‌సెంటర్ పరిచయోత్సవ సంబరాలను జరిపిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో విషాదం నిండింది. ఆనంద స్మృతులను పూర్తిగా అనుభవించకముందే విధి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాతృమూర్తి శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మను మృత్యు రూపంలో కబళించింది.

గతకొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆసుపత్రిలో వుంటుండిన శ్యామలమ్మ నవంబర్ 1వ తేదీ శుక్రవారం ఉదయం 8.30గంటలకు కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె వున్నారు. పెద్దకుమారుడు కోటారెడ్డి మాజీకౌన్సిలర్‌గా నెల్లూరీయులకు సుపరిచితుడే. శ్యామలమ్మ భర్త శివకోటారెడ్డి 2001 మార్చి 6న కన్నుమూసారు. ప్రభాకర్‌రెడ్డికి తల్లే సర్వస్వమయితే ఆ తల్లికి బిడ్డే లోకం. చిన్నకొడుకుతో ఆమెకు అనుబంధం ఎక్కువ. 1997 నుండీ ఆమె ప్రభాకర్‌రెడ్డి దగ్గరే వుంటున్నారు. ఆమె కుమార్తె కూడా ఇటీవల తల్లి దగ్గరకే వచ్చి నెల్లూరులో స్థిరపడిపోయారు. 83వ యేట కన్ను మూసిన శ్యామలమ్మ లేని లోటు ప్రభాకర్‌రెడ్డికి పూడ్చలేనిదే. గత 10రోజులుగా తల్లి వద్దే వుంటూ ఆమెను కంటికి రెప్పలా చూసుకుంటూ ఎలాగైనా ఆమెను బ్రతికించుకోవాలన్న ఆయన ఆశలు ఫలించలేదు. ప్రభాకర్‌రెడ్డికి ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# బస్సెక్కుతున్నావా... భద్రం కొడుకో!



మనిషి ప్రాణం ఎప్పుడు ఏ రూపంలో పోతుందో అంతుపట్టకుండా వుంది. బుధవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా పాలెంవద్ద జరిగిన జబ్బార్‌ట్రావెల్స్ ఏ.సి బస్సు దగ్ధమైన ఘటనతో ఏ బస్సులో ఎక్కాలన్నా భయపడే పరిస్థితులు వచ్చాయి. ఇప్పటివరకు సుఖమయమైన ప్రయాణానికి ఎక్కువమంది ఏ.సి బస్సులనే ఎంచుకునే వాళ్లు. ఒళ్లు కదలకుండా గమ్యం చేరవచ్చనే ఆలోచనతోనే ఆ బస్సులలో సీట్ల కోసం తాపత్రయపడేవాళ్లు. కానీ నిన్నటి సంఘటనతో ఏ.సి బస్సులపై మమకారం కూడా పోయింది.

మన జిల్లా నుండి కూడా ఆర్టీసీ కాకుండా పెద్ద సంఖ్యలోనే ప్రైవేట్ ట్రావెల్స్ హైదరాబాద్, బెంగుళూరు, విశాఖపట్నం వంటి నగరాలకు వోల్వో బస్సులను నడుపుతున్నాయి. ఇవెంత భద్రంగా వున్నాయనే అనుమానాలు నిన్నటి సంఘటనతో తలెత్తుతున్నాయి. నెల్లూరు నుండి ఆర్టీసీగాని ప్రైవేట్‌విగాని బెంగుళూరు, హైదరాబాద్, విశాఖలకు 20కిపైగానే వోల్వో బస్సులున్నాయి. ఇవి ఎప్పుడూ రద్దీగానే నడుస్తుంటాయి. ఆర్టీసీ కొంతవరకు మేలు. డ్రైవర్లకు శిక్షణనిచ్చి పంపిస్తుంది. ఇటీవల కొన్ని వోల్వో బస్సులు ప్రమాదానికి గురికావడంతో స్పీడ్ గవర్నెన్లు కూడా ఏర్పాటుచేసారు. జిల్లా పరిధిలో వెళుతున్న వోల్వోబస్సులు ఇంత వరకు గుద్దుకోవడం వంటి ప్రమాదాలు చవిచూసాయి. అగ్ని ప్రమాదానికి గురైతే ప్రాణనష్టం ఏ స్థాయిలో వుంటుందో నిన్నటి బస్సు దగ్ధం దుర్ఘటనతో తెలిసొచ్చింది. ప్రైవేట్ డ్రైవర్లకు సరైన శిక్షణ వుండదు. అవగాహన వుండదు. స్టీరింగ్ తిప్పడం, గేర్లు వేయడం, వేగంగా పోవడం అన్నట్లే వారి డ్రైవింగ్ వుంటుంది. వోల్వోబస్సుల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే బయటకుపోయే అవకాశంలేదు. బస్సు మొదట్లో వున్న డోర్‌పైనే అందరి దృష్టి వుంటుంది. ఎమర్జెన్సీడోర్‌పై ప్రయాణీకులకు పెద్దగా అవగాహన వుండదు. బస్సుల్లో మంటలు వ్యాపిస్తే అద్దాలు పగలగొట్టి బయటపడడానికి సుత్తిలాంటి వస్తువులను కొన్నిసీట్లవద్ద అమర్చి వుంటారు. బస్సుల్లో ఎక్కే ప్రయాణీకులకు వీటిగురించి తెలియదు. బస్సు బయల్దేరే ముందు డ్రైవర్లు ప్రయాణీకులకు దీనిపై అవగాహన కల్పించాలి. కాని ఏ డ్రైవర్ కూడా ఆ విధంగా చెప్పడం లేదు. వోల్వోబస్సుల డిజైన్ కూడా ప్రమాదాలకు కారణం. ఆ డిజైన్‌కు అనుగుణంగా మన దేశంలో రోడ్లుండవు. ఎక్కడచూసినా స్పీడ్‌బ్రేకర్లు, కల్వర్టర్లు వుంటాయి. దీంతో బస్సు ఆయిల్ ట్యాంకుగాని, లేదా ఎలక్ట్రికల్ పరికరాలుగాని రోడ్డు రాపిడికి గురై అగ్ని ప్రమాదాలు సంభవించడానికి అవకాశమెక్కువ. తొందరగా పోవాలనే తపన, పోటీతత్వం వల్ల బస్సులు అత్యంత వేగంగా వెళ్లడం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుంది. వోల్వోబస్సులెక్కేది సుఖంగా గమ్యం చేరడానికి. అంతేగాని విగతజీవులుగా ఇంటికి చేరడానికి కాదు. వోల్వోబస్సులను భద్రత కూడిన ప్రయాణానికి అనువుగా మలిస్తే మంచిది.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త, ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.



29.06.1952 - 27.10.2013

ఉత్తరక్రియలు

పెద్దకర్మ

06-11-2013 ఉ॥ 10గం.లకు

దేవిరెడ్డి రాణిప్రమీల

w/o లేట్ దేవిరెడ్డి జగదీష్‌కుమార్‌రెడ్డి

తేది.27.10.2013న స్వర్గస్తురాలైనారు.

ఆమె పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

| కుమారులు | కోడళ్ళు |
|---|---|
| డాక్టర్ దేవిరెడ్డి సత్యకుమార్‌రెడ్డి | - సుధతి |
| దేవిరెడ్డి చైతన్యకుమార్‌రెడ్డి | - చెరిత |
| దేవిరెడ్డి శ్రీకర్‌రెడ్డి | - వైద్య |

అక్క: పెనుబాక రాణిసంయుక్త
అన్న: మూలంరెడ్డి సుబ్బరామిరెడ్డి

మనుమరాళ్ళు - మనుమడు
శ్రీలయ - శ్రీలక్ష్య - యష్‌నీల్

16/1884, మిలీనియమ్ సబ్‌స్టేషన్ ఎదురుగా, శ్రీనివాస అగ్రహారం, మినీబైపాస్‌రోడ్, నెల్లూరులోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియచేయడమైనది.

PDF Compressor Free Version






## మూతులొక్కటే!

కోతులన్నిటికీ మూతులొక్కటే! కాంగ్రెస్ నాయకులూ అంతే! వారు సోనియాగాంధీ భజనపరులు. ఆమెకు వీరవిధేయులు. ఆమె చెప్తే దేనికైనా రెడీ. సమైక్య ఉద్యమం తీవ్ర రూపం దాల్చినా, సీమాంధ్ర కాంగ్రెస్ నేతలు సమైక్య ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్నారేగాని 6నెలల మంత్రి పదవులకు రాజీనామా చేయకుండా, తమ భార్యలను సమైక్యఉద్యమానికి పంపుతున్నారు. ఇరుప్రాంతాల కాంగ్రెస్ నాయకులకు తెలంగాణ ఇచ్చినా, ఇవ్వకపోయినా, సమైక్యంగా ఉంచినా, ఉంచకపోయినా వారికే పట్టదు. వాళ్ళది ఒక్కటే మాట! ఒక్కటే బాట. మేము సోనియాగాంధీకి పాద దాసులం, మేము రాహుల్‌గాంధీని రిమోట్ ప్రధానిగా చేసి భారతదేశ పరువుప్రతిష్ఠలను మంటగల్పడమే మా ధ్యేయం. ఇదీ కాంగ్రెస్ వారి స్వరూపం.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## జాతికి తీవ్ర ముప్పు

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70ఏళ్లు కాబోతుంది. అభివృద్ధికి స్వర్గంగా వుండాల్సిన దేశం తీవ్రవాదులకు స్వర్గధామంగా మారుతోంది. జాతీయవాదులకు, జాతికి దినదిన గండంగా నడుస్తుంది. వేంకటేశ్వరస్వామి మీద దండయాత్ర చేయడానికి పుత్తూరులో మకాం వేసిన తీవ్రవాదులను పట్టుకోలేకపోయి వుంటే ఘోరం జరిగి వుండేది. ముదురుబెండకాయ రాహుల్‌గాంధీ పరిపక్వతలేని ఉపన్యాసాలతో దేశం ఎటుపోతుందో అర్థంకావడం లేదు. నరేంద్ర మోడీ లక్ష్యంగా జరిగిన పాట్నా బాంబు పేలుళ్ళు జాతీయనేతల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

వాస్తురామచంద్ర, నెల్లూరు.

## సమైక్యశంఖారావం మార్మోగింది

హైదరాబాద్ ఎల్.బి స్టేడియంలో జగన్ నిర్వహించిన సమైక్య శంఖారావం సభ అదిరింది. నిన్ను దేశం విడిచి ఇటలీకి పొమ్మంటూ పార్లమెంటు తీర్మానం చేస్తే నువ్వు వెళ్ళిపోతావా అంటూ సోనియాగాంధీకి జగన్ సంధించిన ప్రశ్న కాంగ్రెస్ నేతల దిమ్మ తిరిగేలా చేసింది. దమ్మున్న నాయకుడు జగన్.

సి. కీర్తిరెడ్డి, హైదరాబాద్.

## 'ప్రభా'తం

భారతదేశాన్ని సమర్థవంతంగా పరిపాలించగల నాయకులు కొరవడుతున్నారా? జాతీయ దృక్పథం, జాతీయ స్ఫూర్తి ఎవరిలోనూ కనిపించడం లేదా? దేశం ముందుకు రేపు రాబోతున్న పెనుసవాల్ ఇదే! ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పి.వి.నరసింహారావు, వాజ్‌పేయి వంటి దృఢసంకల్పం, జాతీయ విశాల ప్రయోజనం కలిగిన నాయకుల కొరత స్పష్టంగా కనిపిస్తుంది. ప్రాంతీయ సంకుచిత భావాలు, కుల, మత భావాలతో ఓటర్లను రెచ్చగొట్టి అధికారం కోసం పాకులాడే నాయకులే మనకు కనిపిస్తున్నారు. దేశం త్వరలో ఎదుర్కోబోయే అతిపెద్ద ప్రమాదం జాతీయ నాయకత్వ లోపమే.

దేశ భద్రత, దేశం పట్ల అవగాహన, దేశంలోని అన్ని ప్రాంతాల పట్ల సమదృష్టి కలిగిన నాయకులు ప్రస్తుత రాజకీయాలలో చాలా తక్కువ కనిపిస్తున్నారు. వారిలో కూడా క్లీన్‌ఇమేజ్ అన్నది ఎవరికీ లేదు. వాజ్‌పేయి పాలనతోనే అలాంటి ఉన్నతమైన జాతీయ నాయకత్వం తెరమరుగైనట్లుగా కనిపిస్తుంది.

కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేరుకు జాతీయపార్టీకి నాయకురాలనేగాని దేశం విషయంలో ఒక పంచాయితీ సర్పంచ్‌కున్న అవగాహన కూడా ఆమెకు లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన నిర్ణయంతోనే తేలిపోయింది. తమ కుటుంబ అధికారానికి, తమ ప్రిస్టేజీ కోసం ప్రజలనే విడదీసే ఇలాంటివాళ్ళు దేశ నాయకులైతే దేశాన్నే విభజించినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. కాంగ్రెస్‌లో మిస్టర్ క్లీన్‌గా పేరు తెచ్చుకున్న ప్రణబ్‌ముఖర్జీ లాంటి నాయకుడిని రాష్ట్రపతి భవన్‌కు పంపించి చేతులు దులుపుకున్నారు. మన్మోహన్‌సింగ్ లాంటి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేని నాయకుడు ప్రధాని అయితే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో, దేశం ఏ విధంగా తగలబడుతుందో ప్రస్తుతం మనం టీవీలలో లైవ్‌షోలను చూసినట్లుగా చూస్తున్నాం. ఇక దేశానికి రాహుల్‌గాంధీ ప్రధాని అయితే చూసి తరించాలని సోనియాగాంధీతో పాటు కాంగ్రెస్ నేతలంతా కలలు కంటున్నారు. ఈ ప్రబుద్ధుడు ప్రధాని అయితే దేశం ఏవిధంగా తగలబడుతుందోనని ప్రజలు కలవరపడుతున్నారు. మొదటి నుండి కూడా రాహుల్‌గాంధీ పరిపక్వత లేని మాటలు వివాదాస్పదమవుతున్నాయి. ఆయన ఏదో మాట్లాడి ఇమేజ్ తెచ్చుకోవాలనుకుంటాడు... ఆ మాటలు ఇంకెక్కడికో దారితీసి సంచలనం రేపుతుంటాయి. ముఖ్యంగా మా కుటుంబసభ్యులే అధికారంలో ఉండుంటే... అనే ఆయన అహంకార మాటల ధోరణి దేశంలో పాతుకుపోయిన వారసత్వ రాజకీయాలకు అద్దం పడుతుంది. పేదరికం ఒక మానసిక భావన అన్న ఆయన మాట అర్థంకాక కాంగ్రెస్ పెద్దలు ఇప్పటికే తలలు పట్టుకుని ఉన్నారు. నేరచరితుల ఆర్డినెన్స్ చించేయాలంటూ మాటలతో ఆయన తన ప్రభుత్వాన్నే చించి ఆరేసాడు. ముజఫర్‌నగర్ బాధితులకు ఐఎస్ఐ ఏజంట్లు ఫోన్‌లు చేస్తున్నారని బహిరంగసభల్లోనే చెప్పి మరో సంచలనం రేపాడు. నానమ్మను చంపారు, నాన్నను చంపారు, నన్ను కూడా చంపుతారేమో అంటూ ఎన్నికల బహిరంగసభల్లో ఉపన్యసించి కేంద్రంలో వున్న తమ యూపీఏ ప్రభుత్వంలోనే తమకు భద్రత లేదన్న అర్థాన్ని వివరించారు. నానమ్మ, నాన్నల హత్యలను ప్రజలకు వివరించి, ప్రజల సానుభూతితో ఓట్లు సంపాదించాలనుకునే రాహుల్‌గాంధీ ఈ దేశ నాయకుడిగా పనికిరాడు.



### లోపిస్తున్న నాయకత్వం

**దేశ భద్రత, దేశం పట్ల అవగాహన, దేశంలోని అన్ని ప్రాంతాల పట్ల సమదృష్టి కలిగిన నాయకులు ప్రస్తుత రాజకీయాలలో చాలా తక్కువ కనిపిస్తున్నారు. వారిలో కూడా క్లీన్ ఇమేజ్ అన్నది ఎవరికీ లేదు. వాజ్‌పేయి పాలనతోనే అలాంటి ఉన్నతమైన జాతీయ నాయకత్వం తెరమరుగైనట్లుగా కనిపిస్తుంది.**

బీజేపీలో చూస్తే అద్వానీకి మతవాదిగా ఎప్పుడో ముద్రపడిపోయింది. ఒకవేళ మిగతావారితో పోలిస్తే జాతీయభావాల దృష్ట్యా ఆయన ఎంతో మేలనుకున్నా, ప్రస్తుత కాలానికి ఆయన సరిపోవడం లేదు. ఇకపోతే నరేంద్ర మోడీ! మూడో దఫాలో గుజరాత్‌లో బీజేపీని గెలిపించిన ఘనత ఆయనది. అక్కడ బీజేపీ గెలిచిందనేకంటే మోడీ అభివృద్ధి వాదమే గెలిచిందని చెప్పవచ్చు. ముఖ్యమంత్రిగా మోడీ పరిపాలనా దక్షుడే! కాని 2002నాటి గుజరాత్ అల్లర్లు ఆయన నాయకత్వానికి లోపమే. దేశంలోని ప్రజలందరికీ కుల మత రహిత దృష్టితో చూసే సమైక్యస్ఫూర్తి ఆయనలో ఉందా? అనేది ఇక్కడే ప్రశ్నార్థకమవుతుంది. కాని గుజరాత్ ముఖ్యమంత్రిగా అభివృద్ధి విషయంలో ఆయన ఎక్కడా కుల, మత భావం చూడలేదన్నది నిర్వివాదాంశం. ఇదే స్ఫూర్తిని జాతీయ స్థాయిలో చూపగలడా? అనేది అనుమానం.

దేశానికి ప్రధానులు కావాలని చాలామంది కలలు కంటున్నారు. సీపీఎం, సీపీఐ నేతలకు జాతీయ భావాలున్నా, వాళ్లకు దేశనాయకత్వ బాధ్యతలు చేపట్టే అవకాశాలు తక్కువ. ఇక ములాయంసింగ్ యాదవ్ చూస్తే సంకుచిత స్వభావి. నితీష్‌కుమార్‌కు ప్రాంతీయతత్వం ఎక్కువ. జయలలిత చూస్తే గతంలోనే అవినీతి కేసులతో భ్రష్టుపట్టిపోయింది. మాయావతిదీ ఇదే పంథా. మమతాబెనర్జీ చూస్తే కక్ష సాధించే మనిషిగా పేరుతెచ్చుకుంది. ప్రస్తుతం ఇందిరా, వాజ్‌పేయిల వంటి నాయకులు కనిపించడంలేదు. దేశం కోసం పనిచేసే నాయకుల కొరత దేశాన్ని వెంటాడుతుంది.

## 'అంతర్'జాతీయం

- బీహార్ రాజధాని పాట్నా అక్టోబర్ 27వ తేదీ వరుస బాంబుపేలుళ్లతో దద్దరిల్లింది. బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ పాల్గొన్న బహిరంగసభ ప్రాంగణంలో జరిగిన వరుస బాంబుపేలుళ్లలో 6మంది మరణించగా 82మంది గాయపడ్డారు. నరేంద్ర మోడీ సభాప్రాంగణానికి రాకముందే ఈ బాంబులు పేలాయి. మొదట పాట్నా రైల్వేస్టేషన్‌లో పేలుడు సంభవించింది. తర్వాత గాంధీమైదాన్‌లో బాంబులు పేలాయి. బాంబులు అంత శక్తివంతమైనవి కాకపోవడంతో ప్రాణనష్టం తగ్గింది. ఇది ఇండియన్ ముజాహిదీన్ తీవ్రవాద సంస్థ జరిపిన దాడిగా పోలీసులు నిర్ధారించారు.
- భవిష్యత్ యుద్ధ అవసరాల దృష్ట్యా రోబో సైనికులు, మానవరహిత పోరాట సామర్థ్యం పెంచుకోవడం తమముందున్న సవాళ్లని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ అవినాశ్‌చందర్ పేర్కొన్నారు. అక్టోబర్ 26వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన రక్షణధాతు పరిశోధన సంస్థ స్వర్ణోత్సవ వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాబోయే 15ఏళ్లలో ఈ దిశగా తమ పరిశోధనలుంటాయన్నారు.
- ఇందిర, రాజీవ్‌ల హత్య విషయంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సిక్కుల మనోభావాలను గాయపరిచేలా ఉన్నాయంటూ 'ఢిల్లీసిక్ గురుద్వారా నిర్వహణ కమిటీ' అధ్యక్షుడు మంజిత్‌సింగ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసారు. ఆయన వాఖ్యలు 1984నాటి పాతగాయాలను మళ్ళీ రేపేలా ఉన్నాయని పేర్కొన్నారు.
- సౌదీఅరేబియాలో మహిళలు కార్లు నడుపుతున్నారు. కార్లు నడిపిన చిత్రాలను, వీడియోలను యూట్యూబ్‌లో ఉంచుతున్నారు. తమకు కార్లు నడిపే హక్కు కల్పించాలని అక్కడి మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ప్రపంచంలో సౌదీఅరేబియా ఒక్కటే మహిళలు కారు నడపడాన్ని నిషేధించింది.
- ఇరాక్ రాజధాని బాగ్దాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో అక్టోబర్ 27వ తేదీ జరిగిన బాంబుపేలుళ్లలో 62మంది మృతిచెందారు.
- ఐదురాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీ, క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ప్రచారం చేయరని బీసీసీఐ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ ఎంపీ రాజీవ్‌శుక్లా వెల్లడించారు. కాంగ్రెస్ తరపున సచిన్ ప్రచారం చేస్తారంటూ వచ్చిన కథనాలను ఆయన ఖండించారు.
- నీటి వివాదాలను పరిష్కరించుకోవడానికి జలవిధానాలను సవరించుకోవాలని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 28వ తేదీ న్యూఢిల్లీలో జరిగిన "సెకెండ్ ఇండియా వాటర్ ఫోరమ్" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నీటి నిర్వహణ చాలా కీలకమన్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- జగన్‌తో అధిష్టానం మ్యాచ్‌ఫిక్సింగ్. - జె.సి ధ్వజం.
వ్యాఖ్య :- **ఆ విషయం తెలియక మీరు అమాయకంగా మ్యాచ్ చూస్తున్నారా?**

వార్త :- రాహుల్‌తో కలిసి పని చేయడం అసాధ్యం. - శరద్‌పవార్.
వ్యాఖ్య :- **ఆయనకున్న పిచ్చి మీకు పడుతుందని భయమా!**

వార్త :- అనాగరికంగా విభజన నిర్ణయం. - బీజేపీ నేత వెంకయ్య.
వ్యాఖ్య :- **అనాగరికపు కాలపు పార్టీ కాబట్టే ఆ నిర్ణయం.**

వార్త :- ప్రభుత్వం మెడలువంచైనా పరిహారం ఇప్పిస్తా. - చంద్రబాబు.
వ్యాఖ్య :- **అసలు ప్రభుత్వం ఉంటేగా మెడలు వంచడానికి.**

వార్త :- విభజన నిర్ణయం కేసీఆర్ వల్ల రాలేదు. - కొణతాల రామకృష్ణ.
వ్యాఖ్య :- **ఆ విషయం ఆయనకు కూడా తెలుసు.**

వార్త :- ముఖ్యమంత్రి ప్రచారం కోసమే రచ్చబండ. - బి.వి.రాఘవులు.
వ్యాఖ్య :- **ఆయనకు అంత టాలెంట్‌వుంటే రాష్ట్రంలో ఈ పరిస్థితి ఎందుకొస్తుంది.**

వార్త :- రైతుల ఋణమాఫీకి కృషి. - చిరంజీవి.
వ్యాఖ్య :- **ప్రభుత్వం పారిశ్రామికవేత్తల ఋణమాఫీలో బిజీగా ఉన్నట్లుంది.**

వార్త :- కాంగ్రెస్‌కు మున్సిపల్ మూడ్ లేదు. - సీమాంధ్రలో నేతల విముఖత.
వ్యాఖ్య :- **అనవసరపు ఖర్చు ఎందుకనుకుంటారు.**

వార్త :- రౌడీయిజంతో రాష్ట్రాన్ని విభజిస్తారా? - కేంద్రంపై మండలి బుద్ధప్రసాద్ ధ్వజం.
వ్యాఖ్య :- **మరి మాటలతో చెబితే విడదీయనిస్తారా?**

వార్త :- రాష్ట్రపతికి, ప్రధానికి రాజ్యాంగం తెలుసు. - పి.సి.చాకో.
వ్యాఖ్య :- **ఈమధ్యే తెలుసుకున్నారా?**

వార్త :- ఓట్ల కోసం అందరం దిగజారిపోయాం. - టీటీడీ ఛైర్మన్ బాపిరాజు.
వ్యాఖ్య :- **అయినా మీ కాంగ్రెస్ అధిష్టానాన్ని ఎవరూ దాటలేరు.**

వార్త :- తెలంగాణ సునామీ ముందు ఎవరూ నిలవలేరు. - గద్వాల్ సభలో కాంగ్రెస్ నేతలు.
వ్యాఖ్య :- **సముద్రంలో సునామీ అయితే ఓకే... కాని మీది చెరువులో సునామీ లాగుంది.**

వార్త :- అన్ని ప్రాంతాల ప్రయోజనాల రక్షణకు సలహాలు పంపండి. - రాష్ట్ర ప్రజలకు దిగ్విజయ్ సూచన.
వ్యాఖ్య :- **మీకు సలహాలు చెప్పడమంటే చెవిటివాని ముందు ఇళయరాజా సంగీతకచేరినే కదా!**

PDF Compressor Free Version



# హుషారవుతున్న కార్పొరేషన్

మార్పు అనేది సహజం. ప్రపంచంలో ప్రతి సెకనుకు అనేక మార్పులు జరుగుతూ వుంటాయి. అలాగే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే దిశలో నేడు వేగంగా అడుగులేస్తోంది. కార్పొరేషన్ అధికారుల ఆదేశాలను సత్వరం కిందిస్థాయి ఉద్యోగులకు చేరవేసేందుకు వైర్‌లెస్ సెట్లను వినియోగించడానికి చర్యలు చేపట్టారు. వీటిని గతనెల 30న 65మంది ఉద్యోగులకు ఇచ్చి క్షేత్రస్థాయిలో పనులను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నగర అభివృద్ధికి పాటుపడనున్నారు. ఇప్పటి వరకు సెల్‌ఫోన్లు వినియోగిస్తూ వచ్చారు కాని కొన్ని సమయాల్లో నెట్‌వర్క్ పనిచేయక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుండేది. కమీషనర్, డిప్యూటీ కమీషనర్‌తో పాటు పారిశుధ్య విభాగంలోని ఆరోగ్యాధికారి, శానిటరీ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగంలో ఎంఈలు, డీఈఈలు, ఏఈఈలకు, ఫిట్టర్లకు పట్టణ ప్రణాళికా విభాగంలో సిటీ ప్లానర్, సహాయక సిటీప్లానర్, టీపీఓ, టీపీఎస్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు వీటిని ఇచ్చారు. వీటిని వినియోగించడం వల్ల మందకొడిగా సాగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిపై కొంత వత్తిడి పెరిగి కార్పొరేషన్ పరిపాలన సులభతరమవుతుందని కొందరి ఉవాచ.

# ఎస్సీల ఉపాధిలో సబ్సిడీ 60శాతం

నెల్లూరులోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో గతనెల 29న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ కమిటీ సభ్యులు యం.అన్నపూర్ణమ్మ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ లబ్దిదారులకు ఆర్థికపరమైన సహకారం, ఉపాధి అవకాశాలు అందించేందుకు రాష్ట్రప్రభుత్వ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడి 30శాతం నుండి 75శాతం వరకు అందించాలని కమిటీలో ప్రతిపాదించగా 60శాతం వరకు ప్రభుత్వం ఆమోదించిందని, త్వరలో ఉత్తర్వులు వెలువడతాయన్నారు. దీంతో ఎస్సీ వర్గాలకు మరింత ఆర్థిక వెసులుబాటు జరిగే అవకాశం వుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాల సాధనకు అధికారి స్థాయి నుండి క్రిందిస్థాయి సిబ్బంది సమన్వయ సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నెల్లూరు జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ కార్యక్రమాలు మిగిలిన జిల్లాలకంటే మెరుగైన దిశలో సాగుతున్నాయని సంతృప్తిని ప్రకటించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు.

సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఇడి టి.సోమయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి జార్జ్ తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌సెల్‌లో కొత్త విధానం

## అమల్లోకి తెచ్చిన జిల్లా కలెక్టర్

నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జిల్లా, డివిజన్ మండల స్థాయిలో ప్రజల నుంచి అధికారులు గ్రీవెన్స్‌సెల్‌లో సమస్యలు, వినతులు స్వీకరిస్తుంటారు. సమస్యలు పరిష్కారం కాక వచ్చినవారే మళ్ళీ మళ్ళీ కలెక్టర్ కార్యాలయానికి అధికసంఖ్యలో రావడం, మండల పరిధిలో అధికారులు స్పందించడం లేదంటూ బాధితులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో కలెక్టర్ శ్రీకాంత్ కొత్త విధానానికి భాష్యం పలికారు. ఇకపై ప్రతి అర్జీపై ముందుగానే అధికారి స్పందన ఉండేలా సూచించారు.

ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను కలెక్టర్ కార్యాలయంలో ముందుగా ఆయాశాఖల సిబ్బంది స్వీకరించి అప్పటికప్పుడు ఫోన్‌ద్వారా గాని నేరుగా గాని సంబంధిత మండల, డివిజన్ స్థాయి అధికారితో మాట్లాడి సమస్యకు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటారు. ఇలా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి పదేపదే ప్రజలు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగకుండా చూస్తారు. ఈమేరకు కలెక్టర్ మార్పులు చేసారు.

# ఖతర్నాక్

**ఇల్లు బాడుగకు కావాలని, తనకెవ్వరూ లేరంటూ వృద్ధదంపతులను నమ్మించి, ఇంట్లో చేరి సమయంచూసి విలువైన నగలు కాజేసి టైం బాగోలేక పోలీసులకు దొరికిపోయిన ఖతర్నాక్ సంగతి...**

వివరాల్లోకి వెళితే నెల్లూరు నగరం రెండవనగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌సీ బాలయ్యనగర్‌లో పూజారి శ్రీనివాసులు, రామానుజమ్మ దంపతులు కాపురముంటున్నారు. వెంకటగిరి మల్లమ్మ దేవాలయం ప్రాంతానికి చెందిన మహంకాళి వెంకటరమణ కొడుకు శ్రీనివాసులు(27) పూజారి శ్రీనివాసులు దంపతుల్ని నమ్మించి ఇంట్లో బాడుగకు చేరి మంచిగా, అమాయకుడిగా నటిస్తూ వాళ్ళ ఇంటిలోకి వస్తూ పోతుండేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 23న సాయంత్రం బంధువుల పెళ్ళికి వెళ్లాలని రామానుజమ్మ బీరువాలోవున్న 11సవర్ల బంగారునగలు తీసుకుని ఇంట్లో వంటగదిలో దాచింది. ఇది గమనించిన శ్రీనివాసులు ఇంట్లోకెళ్ళి నగలు కాజేసి జారుకున్నాడు. పెళ్ళికి పోవడానికి ముస్తాబైన రామానుజమ్మ నగల కోసం వంటగదిలోకి వెళ్ళగా కనిపించలేదు. దీంతో రెండవనగర పోలీసుస్టేషన్లో ఫిర్యాదుచేసారు. సిఐ కోటారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి ఆదివారం నిందితుడు శ్రీనివాసులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఏఎస్సై బ్రహ్మానందం, సిబ్బంది అతన్ని పట్టుకుని తమదైన స్టైల్లో విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి 11సవర్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

# దేవాలయాల్లో తెలుగులోనే పరిపాలన

దేవాదాయ ధర్మాదాయశాఖలో తెలుగులోనే పరిపాలనా విధానాన్ని కొనసాగించాలని ఆ శాఖ డిప్యూటీ కమీషనర్ త్రినాథరావు ఆదేశించారు. మంగళవారం నెల్లూరులోని రంగనాయకులుపేట తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలోని వేదికలో జిల్లాలోని అన్ని దేవాలయాల కార్యనిర్వహణాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదాయ కమీషనర్ తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆలయ రిజిష్టర్లు, వ్యవహారాలను తెలుగులోనే జరిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా ఆలయాలకు సంబంధించిన లెక్కలను సంబంధిత అధికారులకు పంపించాలన్నారు జిల్లాలో యాభైవేల రూపాయలపైన ఆదాయం వచ్చే ఆలయాలు 222 ఉన్నాయని వీటిలో సీజిఎఫ్ నిధులు, ఆడిట్ ఫీజులు, అర్చక వెల్ఫేర్ మొత్తాలను తక్షణమే వసూలు చేయాలని ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్లు తమకు తెలియకుండా జరగకూడదని రిజిస్ట్రేషన్‌శాఖకు గతంలో విన్నవించామని దీనిపై ఆయా డివిజన్ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలన్నారు. భక్తులకు దేవాలయాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయక కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, పెంచలకోన, జొన్నవాడ సహాయ కమీషనర్లు శ్రీనివాసరావు, శివకుమార్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, శైలేంద్రకుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

# తగ్గిన ఎంపిటీసీలు

నెల్లూరుజిల్లాలో ఎంపిటీసీలస్థానాలు తగ్గాయి. గతంలో 599 స్థానాలుండేవి. ప్రస్తుతం 583కు పడిపోయింది. త్వరలో ఎంపీటీసీల ఎన్నికలు జరిపేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. 2011జనాభా లెక్కల ప్రకారం పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎంపిటీసీ ప్రాదేశిక నియోజకవర్గాలను ఖరారు చేయాలని ఎన్నికల కమీషన్ ఆదేశించిన మేరకు జెడ్పీ అధికారులు జిల్లాలో ఎంపిటీసీ స్థానాలను ఖరారుచేసారు. ఇటీవల ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట పంచాయితీలు మునిసిపాలిటీలుగా అవతరించాయి. అంతే కాకుండా నెల్లూరు నగరపాలక సంస్థలో 15, కావలి మునిసిపాలిటీలో 3గ్రామాలను ప్రభుత్వం విలీనం చేసింది. దీని ఫలితంగా జిల్లాలో 599 నుంచి 549కు ఎంపిటీసీల స్థానాలు పడిపోయాయి.

## నారాయణ విద్యార్థినులకు

# గోల్డ్‌మెడల్స్

2009-2013 విద్యా సంవత్సరంలో నారాయణలో బీటెక్ పూర్తి చేసిన ఈఇఈ విభాగానికి చెందిన విద్యార్థిని లలితా తేజస్వినీ, ఈసీఈ విద్యార్థిని అనూషా ప్రతిభకు జేఎన్టీయూ గోల్డ్‌మెడల్స్ ప్రకటించింది. ఈసందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వీరి స్ఫూర్తితో మరింత మంది విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ సాధించాలన్నారు. వరుసగా 11ఏళ్ళు తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి గోల్డ్‌మెడల్స్ సాధించడం గర్వకారణమన్నారు.

ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్స్ శివప్రకాష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భార్గవ్‌రాం, మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ కార్యాలయ పనులు పూర్తి చేయాలి

నెల్లూరు నగరం పొదలకూరురోడ్డు క్షయ ఆసుపత్రి ప్రాంగణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన జిల్లా పరిషత్ కార్యాలయాన్ని, అతిథి భవన మరమ్మత్తుల పనులను వెంటనే పూర్తిచేయాలని సంస్థ సి.ఇ.ఓ.ఎం.జితేంద్ర ఆదేశించారు. నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పీఆర్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు.

# ప్రతి గురువారం కౌలు రైతుల దినం

నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో గతనెల 29న నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లకు ఏడో విడత భూపంపిణీకి సంబంధించి వివిధ సూచనలు చేసారు. నవంబరు 14వతేదీ నాటికి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయాలన్నదే లక్ష్యమని, భూపంపిణీకి సంబంధించిన భూములను గుర్తించడంతో పాటు లబ్ధిదారులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ప్రతి గురువారం కౌలు రైతుల దినాన్ని పాటించి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పేలా కృషి చేయాలని అన్నారు. రేషన్‌కార్డుల మంజూరుకు కావలసిన లబ్ధిదారుల ఫోటోలు, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డులను ఆన్‌లైన్లో వుంచాలని తెలిపారు. సివిల్ సప్లయిస్ అధికారులు రేషన్‌షాపులు, పెట్రోలు బంకులు, కిరోసిన్ హోల్‌సేల్ పాయింట్లు, గ్యాస్ ఏజెన్సీలను క్రమం తప్పక తనిఖీ చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడి వుంటే నివేదికలు సిద్ధంచేసి ఈసీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో నెల్లూరు ఆర్డీఓ పీవీ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, డ్వామా పీడీ గౌతమి, మెప్మా పీడీ కమలకుమారి డీఎస్ఓ ఉమామహేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

## సమైక్యాంధ్ర కోసం ఎన్జీవోల దీక్ష

నెల్లూరు దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్ దగ్గర రహదారిపై గతనెల 28న సమైక్యాంధ్ర కోసం ఎన్జీఓలు బైఠాయించారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా మూకుమ్మడిగా నినదిస్తూ నిరాహారదీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.రవీంద్రబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోని కాలం చెల్లిన వృద్ధ నాయకులు సలహాలు పాటిస్తూ యూపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకోవడంలో ప్రజలు మనోవ్యథకు గురై కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దిగ్విజయ్‌సింగ్ ఆంధ్రప్రదేశ్ విభజనకు ఆజ్యంపోస్తూ తెలుగు ప్రజలను కించపరుస్తున్నారని అన్నారు. వెంటనే ఆయన్ని తన సొంత రాష్ట్రానికి పంపించాలని అన్నారు. నిరాహారదీక్షలో ఎన్జీఓలు సిహెచ్ సుధాకర్‌రావు, వై.రమణారెడ్డి, సతీష్‌బాబు, రవికుమార్, శ్రీనివాసులు, మంజు, రమేష్‌బాబు, కరుణమ్మ, బలరామరాజు, భోగేశ్వరరెడ్డి, వెంకటరత్నం, విజయుడానియేలు, కిరణ్‌శీనయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఏవి శాస్త్రి, శేఖర్‌రావు, నాగరాజు, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

# అధిష్టానానికి దారేది

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు కాంగ్రెస్‌ను తిట్టిపోస్తున్నారు. ఆ పార్టీ భూస్థాపితం అయితేనే దేశం బాగుపడుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. సరే ఇంతమంది చేత తిట్లుతింటూ, విభజన విషయంలో విలన్‌గా ముద్ర వేయించుకున్నా కాంగ్రెస్‌కు తెలంగాణలో తగిన ఫలితం లభిస్తుందా? ఈ విషయంపై లోతుగా పోతే కాంగ్రెస్‌కు పెద్దగా లాభమేమీ వుండడంలేదు. తెలంగాణ ఇస్తే టీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని గతంలో కేసీఆర్ చెప్పివున్నాడు. కాని ఇప్పుడు ఆ సూచనలు కనిపించడంలేదు. తెలంగాణ తెచ్చిన ఘనతను తమ పార్టీ ఖాతాలో జమచేసుకుని మెజార్టీ ఎంపీసీట్లు సాధించడం ద్వారా రాబోయే కేంద్ర ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించాలనేది కేసీఆర్ ఆలోచన. టీఆర్ఎస్ వేరుగా పోటీ చేస్తే కాంగ్రెస్‌కు పెద్దగా సీట్లు రావు. తెలంగాణలో మొత్తం 17ఎంపీ సీట్లు. ఒకటి ఎంఐఎం గెలుచుకుంటుంది. మిగతా 16సీట్లను టీఆర్ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, బీజేపీలు పంచుకునే అవకాశాలున్నాయి. దీనివల్ల కాంగ్రెస్‌కు ఆశించిన ప్రయోజనం నెరవేరదు.

అలాంటప్పుడు రాష్ట్ర ప్రజల మనోభావాలను గౌరవించి రాష్ట్రాన్ని సమైక్యంగానే ఉంచుతున్నామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటిస్తే... రాష్ట్ర రాజకీయాలే సమూలంగా మారిపోతాయి. సమైక్యాంధ్ర కోసం కాంగ్రెస్ అధిష్టానాన్ని ఢీకొట్టి పోరాడిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని హీరోను చేసి, కాంగ్రెస్ మళ్ళీ ఆయన నాయకత్వంలోనే ఎన్నికలకు సమాయత్తమవుతుంది. రాష్ట్ర విభజనను అడ్డుకున్న క్రెడిట్ కిరణ్‌కు దక్కుతుంది కాబట్టి ప్రజలలోనూ ఆయనపట్ల ఆదరణ వుంటుంది. జగన్‌ది కూడా సమైక్యవాదమే కాబట్టి రాష్ట్రంలో వైకాపాతో పొత్తుకు కూడా మార్గం సుగమం కావచ్చు. తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇచ్చిన తెలుగుదేశంపై నిందమోపి కాంగ్రెస్ సీమాంధ్రలో బలపడవచ్చు. అక్కడ వస్తాయోరావో తెలియని 17సీట్లపై కంటే విభజనను విరమించుకుంటే వైకాపాతో కలిసి సీమాంధ్రలోని 25సీట్లలో జెండా ఎగురవేయవచ్చు. కాంగ్రెస్ అధిష్టానం ఈ దిశగానే ఆలోచిస్తున్నట్లు సమాచారం.

రాజ్యాంగపరమైన అడ్డంకుల దృష్ట్యా ఎన్నికలలోపు రాష్ట్ర విభజనకు అవకాశం లేకపోవడంతో రాష్ట్రంలో తమను తాము రక్షించుకోవడానికి కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై నాలుక మడతపెట్టే అవకాశాలు ఎక్కువవుతున్నాయి.

PDF Compressor Free Version



# నెల్లూరు కబుర్లు

### రాష్ట్రమంతా వరదలు
## నెల్లూరులో ఎండలు

ఓ పక్క రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తుతున్నాయి. హైదరాబాద్‌లో కుండపోతగా వానలు కురిసాయి. శ్రీకాకుళం నుండి ప్రకాశం జిల్లా దాకా 9కోస్తా జిల్లాలను వర్షాలు ముంచెత్తాయి. పలుజిల్లాల్లో వరదలు పోటెత్తాయి. ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్రమంత్రులు వరద ప్రాంతాల్లో పర్యటనలు చేసారు. రాష్ట్ర మంతా వర్షాలు పడుతున్నా మరోపక్క నెల్లూరులో మాత్రం ఆ స్థాయికి తగ్గ వానలు లేవు. నవంబర్ నెలొచ్చినా ఎండలు బాగానే కాస్తున్నాయి. ఉష్ణోగ్రతలు ఇంకా ఒక మోస్తరుగా వుంటుండడంతో రాత్రివేళల్లో ఏసిలు ఆన్‌చేయాల్సి వస్తుంది. గతంలో ఎండలు మండే రెండు, మూడు నెలలు మాత్రమే ఏసిలను ఎక్కువగా వాడేవాళ్ళు, ఇప్పుడు ఒకట్రెండు నెలలు తప్పితే మిగతా ఏడాదంతా ఏ.సిలు ఆన్ అవుతున్నాయి. దీంతో కరెంట్ బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ నెలలోనన్నా బాగా వర్షాలు కురిస్తే బాగుండుననుకుంటున్నారు.

### ప్రపంచ రైతుసదస్సులో
## నెల్లూరు రైతులు

హైదారాబాద్‌లో నవంబర్ 6న జరగనున్న ప్రపంచ రైతు అవగాహన సదస్సుకు నెల్లూరు జిల్లా నుంచి 80 మంది రైతులు హాజరవుతున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖచే నవంబర్ 4, 5, 6, 7 తేదీన నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన రైతులకు సదస్సు జరగనుంది. ఈ సదస్సులో ఆధునిక వ్యవసాయం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. ఇందు కోసం వ్యవసాయంపై అవగాహనవున్న రైతులు, ఆదర్శ రైతులు, రైతు సంఘాల నేతలను ఎంపిక చేసినట్లు తెలిసింది. నవంబర్ 5న రెండు బస్సుల్లో రైతులను సదస్సు కోసం హైదారాబాద్‌కు వ్యవసాయశాఖ జేడి సుబ్బారావు తీసుకువెళ్తున్నట్లు సమాచారం.




అక్టోబర్ 28వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీహాల్‌లో జరిగిన ఎస్సీ ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన జాయింట్‌కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ, అదనపు జాయింట్‌కలెక్టర్ సి.హెచ్.పెంచలరెడ్డి

### రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన
## నారాయణ వైద్య విద్యార్థులు

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన ఎంబిబియస్, బిడిఎస్ మొదటి సంవత్సరం పరీక్షల్లో నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపారు. గతనెల 27న కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రతిభ ఉత్సవ్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.వీరనాగిరెడ్డి, దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ మహేష్, నారాయణ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి డాక్టర్ విజయ్‌కుమార్, ఏజీఎం సిహెచ్.భాస్కర్‌రెడ్డి తదితరులు విద్యార్థులను పురస్కారాలతో అభినందించారు. నారాయణ వైద్య కళాశాల విద్యార్థులు 28 మంది డిస్టింక్షన్స్, 88 మంది ఫస్ట్‌క్లాసు సాధించగా టాప్‌టెన్‌లో ఎస్.అరవింద్‌శ్రీవాత్సవ ప్రథమ, ఎం.జాహ్నవి ద్వితీయ, కృష్ణారెడ్డి తృతీయ, శ్రీతేజ, శ్రీహర్ష, ఆర్.విశాల్, లక్ష్మీసమీర, ఈ.లిఖితలు 5,6,7,8,9, స్థానాలు కైవసం చేసుకున్నారు. దంత వైద్య కళాశాలలో 12మంది డిస్టింక్షన్స్, 47 మంది ఫస్ట్‌క్లాసులో నిలువగా టాప్‌టెన్‌లో ప్రదేశ్ నాయుడు, స్వాతి, శిరీష, జీవీసాయి కల్యాణ్, శ్రీహితలు వరుసగా 1,2,4,5,10 స్థానాలు పొందారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.


## ఆర్టీసీకి అద్దె బస్సులు సిద్ధం

ఏపియస్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో కొత్తగా అనుమతులు లభించిన 60 అద్దె బస్సులు సిద్ధమయ్యాయి. ఈ బస్సులను నెల్లూరు డిపో ప్రాంగాణంలో సోమవారం ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. డిప్యూటి సిఎం ఈ శేషయ్య, డిప్యూటి సిటీఎం చంద్రశేఖర్, నెల్లూరు 1వ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ది నెల్లూరు బిల్డర్స్ అసోసియేషన్ కార్యవర్గం

ది నెల్లూరు బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన కాన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నగరశాఖ సమావేశంలో నూతన ఛైర్మన్‌గా పివీ రాఘవరావు, అధ్యక్షుడిగా డి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడుగా టి.సురేంద్రరెడ్డి, కార్యదర్శిగా సిహెచ్ శ్రీధర్‌రాజు, ఉపకార్యదర్శులుగా పి.కృష్ణారెడ్డి, కె.శివకుమార్, కోశాధికారిగా ఎం.సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రాంరెడ్డి, సిఈఓ ఎం.వి.రాజేశ్వరరావు వ్యవహరించారు. సంఘానికి అనుబంధంగా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడిగా జి.గోపాల్, సభ్యులుగా డి.మధుసూదన్, పి.కృష్ణారెడ్డి, వి.శ్రీహరిరెడ్డి నియమితులయ్యారు.

## భయపెడుతున్న విద్యుత్ స్థంభాలు



నెల్లూరు నగరంలో పలు ప్రాంతాలలో విద్యుత్‌స్థంభాలు ప్రజలను భయపెడుతున్నాయి. ఏ మాత్రం అవగాహన లేనివాళ్లు ఆ స్థంభాల వద్ద నిలబడి చేతులు ఎత్తారో అంతే సంగతులు. నగరంలో సెంట్రల్ లైటింగ్ కోసం అక్కడక్కడా స్థంభాలకు ఫ్యూజ్‌క్యారియర్‌లు ఏర్పాటు చేసారు. వాటికి మూతలేదు, తాళం లేదు. వైర్లు బయటకే వుంటున్నాయి. మున్సిపల్ సిబ్బంది సాయంత్రం వచ్చి ఆ వైర్లను జాయింట్ చేస్తారు. లైట్లు వెలుగుతాయి. మళ్ళీ ఉదయాన్నే వచ్చి వేరు చేస్తారు. ఇవి చేతికి అందే ఎత్తులో వుండడంతో పొరపాటున ఎవరికైనా తగిలిందంటే ప్రాణాలు అంతేసంగతులు. ప్రమాదకరంగా వున్న స్థంభాలను గుర్తించి కార్పొరేషన్ అధికారులు తగుజాగ్రత్త చర్యలు చేపట్టాల్సివుంది.

### నవంబరు 15 నుంచి
## త్రైమాసిక పరీక్షలు

నవంబరు15నుంచి 22వతేదీ వరకు ఒకటోతరగతి నుండి పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు 3నెలల పరీక్షలు (సమ్మేటివ్ అసెస్‌మెంట్-1) జరుగుతాయని నెల్లూరుజిల్లా విద్యాశాఖాధికారి ఎం.రామలింగం తెలిపారు. సమైక్యాంధ్ర సమ్మె వల్ల అంతరాయం కలిగిన పరీక్షలు ఈ తేదీలలో నిర్వహిస్తున్నారు.

## బాణాసంచా పేలేనా?

దీపావళి అంటే పెద్దలకంటే చిన్న పిల్లలకు ఎంతో ఇష్టం. కాని ఈసారి దీపావళిని కొంచెం కష్టంగానే జరుపుకోవాల్సి వస్తుంది. రాష్ట్రంలో నెలకొన్న ఆందోళనల మూలంగా ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్థమైంది. ఉద్యోగులకు రెండునెలల జీతాలులేవు. అప్పులు పెరిగాయి. వ్యాపారాలులేవు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా తగలబడ్డాయి. ఇక దీపావళి అంటే బాణాసంచానే ప్రధానం. వాటి ధరలు చూస్తే ఆకాశాన్నంటుతున్నాయి. సంతోషంగా దీపావళి పండుగను జరుపుకునే పరిస్థితి లేకుండాపోయింది.

## న్యాయస్థానాల మార్పు

జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని స్పెషల్ ఎక్సైజ్ కోర్టు, రెండవ, అయిదవ అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులను మద్రాసుబస్టాండ్ వద్దగల జిల్లాకోర్టు ప్రాంగణంలోకి తరలించారు. కలెక్టరేట్‌లో వున్న కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరడంతో రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు వీటిని మార్చారు. దీంతో అన్ని కోర్టులు కూడా ఒకే ప్రాంగణంలోకి వచ్చినట్లయ్యింది.


### రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో
## నెల్లూరుకు మూడోస్థానం

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సబ్ జూనియర్ బాలికల విజేతగా గుంటూరు, రన్నరప్‌గా హైదరాబాద్ నిలించింది. నెల్లూరు మూడో స్థానం నిలబెట్టుకుంది. విజేతలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి బహుమతి ప్రదానం చేసారు. ఈనెల 25 నుండి 27 వరకు మహబూబ్‌నగర్ స్టేడియం మైదానం, బాలుర కళాశాల మైదానాల్లో పోటీలను నిర్వహించారు. 20జిల్లాల నుంచి 12 వందల మంది క్రీడాకారులు, సాంకేతిక నిపుణులు వంద మంది పాల్గొన్నారు.

## సేవాదృక్పథంతోనే ఇస్కాన్ భోజనం

తాము సేవాదృక్పథంతోనే జిల్లాలోని విద్యార్థులకు మధ్యాహ్నభోజనం సరఫరా చేస్తున్నామని ఇస్కాన్ ఫుడ్‌రిలీఫ్ ఫౌండేషన్ పరిశీలకులు చెన్నకేశవదాసు, రాజశేఖరదాసు, చంద్రశేఖరదాసు, మురళీదాసులు తెలిపారు. సోమవారం నెల్లూరులో విలేకరులతో వారు మాట్లాడారు. మేం ఐదేళ్లుగా స్వచ్ఛందంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం. దీనికిగాను ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో 15కోట్లతో ఆధునిక వంటశాలను నిర్మించాము. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచితబియ్యంతో విద్యార్థులకు భోజనం తయారు చేస్తున్నాము. ఇటీవల రెండునెలలుగా సమైక్యాంధ్ర సమ్మె జరిగింది. సమ్మె అనంతరం పాఠశాలలు తెరువగా, అప్పటికే మా వద్ద రెండునెలలుగా వున్న ప్రభుత్వ బియ్యాన్నే వంటకు ఉపయోగించాం. అయితే వంటశాలలో యంత్రాల రిపేరు కారణంగా బియ్యంలోని పురుగులను పూర్తిగా తొలగించలేకపోయాం. దీనిని పునరావృతం కానివ్వం. ప్రభుత్వం ఇచ్చిన మెనూలో పోషకాహారం కోడిగుడ్డుకు బదులుగా విద్యార్థులకు అరటిపండు లేదా వేరుశెనగముద్దలు ఇస్తున్నాం. ప్రభుత్వం ఇస్తున్న నిధులు సరిపోకున్నా, ఈ ఐదేళ్లలో 35లక్షల రూపాయలు మాచేతివిపడ్డా కూడా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడానికి కృషి చేస్తున్నామని వారు చెప్పుకొచ్చారు.

## డిసిసి అధికార ప్రతినిధిగా చెంచలబాబు



డిసిసి అధికార ప్రతినిధిగా మాజీ జిల్లాపరిషత్ ఛైర్మన్ పి.చెంచలబాబుయాదవ్‌ను నియమించారు. తన నియామకానికి కారణమైన సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మలేసియాలో పెరుగు రామకృష్ణకు ప్రశంసలు



పెరుగును అభినందిస్తున్న జంబ్రి అబ్దుల్ ఖాదీర్

33వ వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పొయెట్స్ కార్యక్రమంలో భాగంగా గతనెల 20 నుంచి 25వ తేది వరకు మలేసియా దేశంలోని రాష్ట్ర రాజధాని ఇపోహ్‌లో జరిగిన కవి సమ్మేళనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ జంబ్రి అబ్దుల్ ఖాదిర్ నుంచి నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత పెరుగు రామకృష్ణ ప్రశంసలు అందుకున్నారు. వరల్డ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆధ్వర్యంలో జరిగిన కవి సమ్మేళనంలో 20దేశాల నుంచి 152 మంది కవులు పాల్గొన్నారు. కవి సమ్మేళనంలో పెరుగు రామకృష్ణ రాసిన కవితలకు జంబ్రి అబ్దుల్ ఖాదిర్ ప్రశంసలు లభించాయి.

ఈసందర్భంగా విడుదల చేసిన విశ్వకవితా సమ్మేళనంలో పెరుగు రామకృష్ణ భారతీయ కవిగా నమోదు అయినట్టు తెలిపారు.

## మతమార్పిడికి ప్రలోభపెడుతున్నారు

హిందువులను ప్రలోభపెట్టి కొంతమంది మతమార్పిడికి పాల్పడుతున్నారని హిందూధర్మరక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు వేదులూరి గవరయ్య అన్నారు. ఇటీవల నెల్లూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కొంత మంది తమదే అసలైన మతమంటూ అమాయకులైన హిందువులను మతమార్పిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. నెల్లూరు జిల్లాలో ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మతమార్పిడిలు జరుగుతున్నందున తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో హిందూ ధర్మరక్ష సమితి రాష్ట్ర ధర్మాచార్య ప్రభోద చైతన్య, షెడ్యూలు కులాల హిందూ పరిరక్షణ రాష్ట్ర కన్వీనర్ మత్తాల సత్యనారాయణ, జిల్లా కన్వీనర్ అర్జున బాలకృష్ణ పాల్గొన్నారు.

PDF Compressor Free Version





అక్టోబర్ 30వ తేదీన సోమశిల రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి. పక్కన జిల్లా కేంద్ర సహకారబ్యాంకు చైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

# విస్తృతంగా పోస్టల్ సేవలు

## ఏపీ చీఫ్ పోస్టుమాస్టర్ సుధాకర్



ప్రజలకు అందుబాటులో మరిన్ని కొత్త పోస్టల్ సేవలను విస్తృతంగా అందించనున్నట్లు ఏపీ చీఫ్ పోస్ట్‌మాస్టర్ బివి సుధాకర్ తెలిపారు. గతనెల26న నెల్లూరులోని స్థానిక హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. భారతదేశంలో 150ఏళ్ళుగా పోస్టల్ శాఖ వివిధ సేవలందిస్తున్నదన్నారు. నెల్లూరు జిల్లాలో డిసెంబర్ నెలలో చింతారెడ్డిపాళెం, తడలో కొత్త పోస్టాఫీసులను ప్రారంభిస్తుందన్నారు. లాజిస్టిక్ సర్వీసుల ద్వారా ఫోన్‌చేస్తే సామాన్లు రవాణా చేస్తామన్నారు. 117సేవలను మీ సేవ సర్వీసుల ద్వారా అందిస్తున్నామన్నారు. జిల్లాలో నెల్లూరు పెద్దపోస్టాఫీసు, గూడూరు, కావలి పోస్టాఫీసుల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలు జరుగుతున్నాయన్నారు. ప్యాక్ పోస్ట్ ద్వారా విదేశాలకు పంపే వస్తువులను ప్యాక్ చేసి వినియోగదారులకు లబ్ధి చేకూరుస్తామన్నారు. "ఉత్తరం వచ్చింది" అనే సర్వీసు ద్వారా కస్టమర్‌కు ఉత్తరం రాగానే ఎస్.ఎం.ఎస్ పంపుతామన్నారు.

"మీరు మీ డబ్బు" అనే సర్వీసు ద్వారా పోస్టాఫీసులో ఆర్థిక లావాదేవీలను వినియోగదారులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలుపుతామన్నారు. ఇందుకోసం వినియోగదారులు appost@gmail.comకు తమ మొబైల్ నెంబర్‌ను పంపాలన్నారు. జిల్లాలో ఈ నూతన పథకాలను నవంబర్ నెల 15 నుంచి ప్రారంభిస్తామన్నారు. వీటితోపాటు వరల్డ్‌నెట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వీసు ద్వారా ప్రపంచంలోని 227 దేశాల్లోని పార్సిల్స్, ఉత్తరాల డెలివరీ సమయాన్ని ఖచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఆశీర్వచనం స్కీమ్ ద్వారా టీటీడి ప్రసాదాలు, అక్షింతలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని వెంకటాచలం మండలం కసుమూరు దర్గా నుంచి పోస్టల్‌శాఖ ద్వారా ఈ సేవలు విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కోర్‌బ్యాంకింగ్ సొల్యూషన్స్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కోర్ బ్యాంకింగ్ సర్వీసుల ద్వారా దేశవ్యాప్తంగా పోస్టాఫీసులన్నీ అనుసంధానం అవుతాయన్నారు. బంగారుతల్లి, అభయహస్తం పథకాలను పోస్టల్‌శాఖ ద్వారా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో విజయవాడ పోస్టుమాస్టర్ జనరల్ ఎం.సంపత్, నెల్లూరు పోస్టల్ సూపరింటెండెంట్ పరిశుద్ధరావు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# పరువుతీసిన గురువులు

## • వాకాడు ఐటిఐ కాలేజీపై ఏసిబి దాడి

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తర్వాత అంతటి ఉన్నత స్థానం గురువులది. తాను ఉపాధ్యాయవృత్తిలో వున్నా, తన వద్ద చదువుకునే శిష్యుడు ఐఏఎస్, ఐపిఎస్ వంటి ఉన్నతస్థానాలకు చేరుకోవాలనే నిస్వార్థమైన ప్రేమ గురువులది. అలాంటి పవిత్రమైన వృత్తికే కళంకం తెచ్చారు కొందరు గురుప్రబుద్ధులు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఏసిబి అధికారులు

దీనికి సంబంధించిన వివరాలిలావున్నాయి... వాకాడులో ఐటిఐ కాలేజీ వుంది. తమలోని ప్రతిభనంతా రంగరించి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయడం అధ్యాపకుల బాధ్యత. కాని ఇక్కడ కొంతమంది అధ్యాపకులు ఆ నైతిక బాధ్యతను విస్మరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించడం కోసం, మంచి మార్కులు వేయడం కోసం వారి నుండే డబ్బులు వసూలుచేయసాగారు. ఈ పరిణామాలతో విద్యార్థులకు విసుగొచ్చింది. గురువుల మీద భక్తిపోయి విరక్తి కలిగింది. వాళ్ళు ఏసిబి డీఎస్పీ భాస్కర్‌రావును ఆశ్రయించారు. మంగళవారం ఏసిబి డీఎస్పీ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఐటిఐ కళాశాలపై దాడులు జరిగాయి. కళాశాల సిబ్బంది వద్ద విద్యార్థుల నుండి అక్రమంగా వసూలు చేసిన రెండులక్షల 13వేల రూపాయలు ఏసిబి అధికారులు పట్టుకున్నారు. ఇప్పటివరకు ఏసిబి దాడులు వివిధ ప్రభుత్వ శాఖలకే పరిమితమవుతూ వచ్చాయి. అధ్యాపకుల మీద ఏసిబి దాడులనేది ఎవరూ వూహించని విషయం. కాని వాకాడు ఐటిఐ కళాశాల అధ్యాపకులు ఆ ఘనతను సాధించి చరిత్రకెక్కారు.

# కాశ్మీర్ తలకాయ... హైదరాబాద్ గుండెకాయ

- వివేకా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం వివేకా, పక్కన ముంగమూరు


భారతదేశానికి జమ్మూ-కాశ్మీర్ తలకాయ అయితే హైదరాబాద్ గుండెకాయ వంటిదని, హైదరాబాద్‌ను ఆంధ్రప్రదేశ్ నుండి వేరుచేస్తే శరీరం నుండి గుండెను తీసివేయడమేనని నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని ఏ.సి.నగర్ మున్సిపల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో హైదరాబాద్‌ను మరో కాశ్మీర్‌లాగా మార్చొద్దని కేంద్రాన్ని కోరారు. విభజన జరిగితే కోస్తాలో పారిశ్రామిక కారిడార్ వస్తుందో రాదోగాని తెలంగాణ మాత్రం నక్సలైట్లకు కారిడార్‌గా మారుతుందన్నారు. సీమాంధ్రులకు రక్షణ కల్పిస్తామంటున్న కేసీఆర్, వి.హెచ్.హనుమంతురావు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. హైదరాబాద్ వాళ్ళబ్బ సొత్తు కాదన్నారు. విభజనతో హైదరాబాద్ ఉగ్రవాదులకు అడ్డాగా మారుతుందన్నారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం, ఇతర సమస్యల పరిష్కారం కోసం వేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు ఒకరిద్దరి అభిప్రాయాలతో సరిపెట్టుకోకుండా మెజార్టీ అభిప్రాయాలను సేకరించి, తదనుగుణంగా కేంద్రానికి నివేదిక ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత పార్టీ పెడుతారన్నది ఒట్టి ఊహాగానమేనన్నారు. జగన్‌తో కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుందంటూ జె.సి.దివాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. ఈ సమావేశంలో నగరఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కూడా పాల్గొన్నారు.

# శ్రీసిటీలో యూనిఛామ్

బేబీకేర్ ఉత్పత్తులను తయారు చేయడంలో అంతర్జాతీయంగా పేరున్న జపాన్ కంపెనీ యూని ఛామ్ కార్పొరేషన్ తడ వద్దగల శ్రీసిటీలో తమ కొత్త పరిశ్రమను ఏర్పాటు చేయబోతుంది. 250కోట్ల పెట్టుబడితో నిర్మించబోయే ఈ పరిశ్రమకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. 40ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. 2015కల్లా దీనిని పూర్తి చేయనున్నారు. ఇది పూర్తయితే దాదాపు వెయ్యిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



# జిల్లాలోనే నెం.1 దంతవైద్యశాల "స్మైల్"



డా॥ కిరణ్

అత్యల్పమైన ఖర్చుతో అత్యుత్తమమైన దంతవైద్యాన్ని అందించే సూపర్‌స్పెషాలిటీ దంతవైద్యశాల "స్మైల్". ఎన్నో వేలమందికి తన అధునాతన సేవలను అందిస్తూ ఆధునిక దంతవైద్యానికి చిరునామాగా నిలుస్తోంది. నెల్లూరులోని రమేష్‌రెడ్డినగర్‌లో ప్రముఖ కాస్మటిక్ దంత వైద్య నిపుణులు డాక్టర్ జి.కిరణ్ ఆధ్వర్యంలో 1999లో నెలసిన స్మైల్ సూపర్‌స్పెషాలిటీ దంతవైద్యశాల చికిత్స విషయంలో ఎక్కడా రాజీపడకుండా ఒక్కొక్క విభాగానికి ప్రత్యేకించి వైద్యులను, అనుభవజ్ఞులైన సిబ్బందిని ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన లేజర్ ఎక్విప్‌మెంట్ కలిగివుంది. ఈ దంతవైద్యశాల నెల్లూరుజిల్లాలోనే నెం.1 దంతవైద్యశాలగా ప్రజల గుండెల్లో చెరగనిముద్ర వేసుకుంది. నాణ్యమైన దంతవైద్యంతో పాటు ఆరోగ్యకరమైన దంతాల రక్షణ గురించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు గ్రామాల్లో, పాఠశాలల్లో ఉచిత దంతవైద్య శిబిరాలు నిర్వహిస్తూ పిల్లల్లో పిప్పిపళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెద్దలలో నోటిక్యాన్సర్ రాకుండా పాటించాల్సిన నియమాల గురించి "స్మైల్" విస్తృతంగా సామాజిక సేవలు అందిస్తోంది. అంతేకాకుండా మరొక అడుగు ముందుకేసి "డెంటల్‌కేర్" పేరుతో పక్షపత్రికను వెలువరించి గత 4సంవత్సరాలుగా జిల్లాలోని అన్ని మండలాల్లో పంపిణీ చేస్తోంది. దంతవైద్యంలో ఈ విధంగా విప్లవాత్మక మార్పులతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్న "స్మైల్" దంతవైద్యశాల చిరకాలం నెల్లూరుజిల్లా ప్రజానీకం మోముల్లో చిరునవ్వులు చిందేలా చేయాలని 'లాయర్' ఆకాంక్షిస్తుంది.

# క్యాన్సర్‌ని ప్రాథమిక దశలో గుర్తించాలి

క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారణకు సరైన వైద్యం చేసే అవకాశం ఉంటుందని చెన్నై గ్లోబల్ హెల్త్ సిటీకి చెందిన ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు అరుణా చంద్రశేఖరన్ పేర్కొన్నారు. గతనెల 27న నెల్లూరులోని గ్లోబల్ హాస్పిటల్స్ క్లినిక్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌వ్యాధిపై అనేక మందికి అపోహలున్నాయని గ్లోబల్ హాస్పిటల్‌లో అత్యాధునిక పరికరాలతో రేడియేషన్ థెరపీతో మెరుగైన వైద్యం చేస్తామన్నారు. అనంతరం రోగులను పరీక్షించి మందులందజేసారు.


దీపావళి శుభాకాంక్షలతో...

NKV INTERNATIONAL
(A Unit of NKV)

• Air Ticketing • Passport Assistance • Visa Assistance
• Tour Package • Hotel Bookings • Foreign Exchange

Nimmala Balakrishna, M.B.A., Proprietor
Mobile: 9704 661144
0861 - 2313744



# 16-2-343, IInd Floor, Santhi Sweets, Vijayamahal Center, Nellore - 2.
E-mail : nkvintl@gmail.com, nkvtravelservices@yahoo.com
nkvtravelservices@gmail.com

PDF Compressor Free Version

K



## కదంబం

### తడిసిన వాక్యాలు

దర్భశయనం శ్రీనివాసాచార్య
వరంగల్, 94404 19039.

కొసేపని కాదు
రోజుల తరబడి ఎడతెగని వాన
బతుకు ముద్దముద్దయిపోతున్నది
ఆరబెడదామంటే ఏది తెరిపి?

దారులన్నీ నీళ్ళ దాడిలో అదృశ్యమై
తాకబోతే చేతులకు తడిగాటు
నడవబోతే కాళ్ళను గుచ్చుతూ తడిముళ్ళు
చూడబోతే నింగి నుంచి దూకుతున్న
నీటి సూదుల పరంపర - నేలను తాడిస్తూ -
నిల్చున్న వరీ పత్తీ శనగా మొక్కలూ
నేలకొరిగి నీళ్ళల్లో నానుతూ, కళేబరాల్లా -
రైతు దుఃఖనదిలో కొట్టుకుపోతున్నాడు
దరికి రావడానికి ఏ దుంగా దొరకదు
అతని వంట్లో ఇప్పుడు రక్తంలేదు
నీళ్ళూ, మునక మిగిల్చిన మూగతనం తప్ప!

ఈదురుగాలుల్లో ఊపిరులన్నీ చిక్కుకుపోయి
ఎదురుచూపుల్లో వానాగాలీ దయతల్చి
శాంతించకపోతాయా అని
ఎదురు చూపుల్ని సైతం వెక్కిరిస్తూ
వెల్తురూ మాయమవుతుంది - చుట్టూ చీకటి!
నీళ్ళు నిండిన కళ్ళతో చీకట్లో
దేన్ని చూసేది
ఎటు నుంచీ పొడిరాగం వినబడదు
వెచ్చని ఓదార్పు రేఖ ఏ దిశ నుంచీ వాలదు

ప్రాణదాత కదా జలం! ఇవాళ దాన్ని
ఎట్లా శపించేది?
కానీ శపించకుండా వుండేదెట్లా?

కాలం
తడి తీరమ్మీద కొట్టుకుంటున్నది
ఎట్లా దాన్ని ఆరబెట్టేది
ఏమీ చేసేది లేదిపుడు
బతుకును వెచ్చబరిచే ఆదిత్యుడి కోసం
తడికళ్ళతో ఓదురుచూడ్డం తప్ప!

## ఛాయరాజ్ రచనలు స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం ఛాయరాజ్ సాహిత్యం-సమకాలీనత అంశంపై ప్రగతిశీల ప్రజావేదిక ఆధ్వర్యంలో గత నెల 27న నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్ రూమ్‌లో చర్చ జరిగింది. చర్చలో పాల్గొన్న జనసాహిత్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దివికుమార్ మాట్లాడుతూ రైతుకూలీల శ్రమవల్లే అందరి ఆకలి తీరుతోందని, కాని ఆ రైతు కూలీలే ఆకలితో అలమటించకుండా చూడాల్సిన బాధ్యత అందరి మీద వుందంటూ శ్రీకాకుళం ఛాయరాజ్ తన రచనల్లో పేర్కొన్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్‌లో పనిచేస్తూ ప్రజల పోరాటాలను తన రచనల ద్వారా ఛాయరాజ్ ప్రకటించారన్నారు. స్వర్గీయ ఛాయరాజ్ చిత్ర పటానికి నివాళులర్పించి ఆయన రచనలు అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. చర్చలో ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ప్రగతిశీల ప్రజావేదిక కన్వీనర్ శరవణ, కొండమ్మ, రైతుకూలీ సంఘం రాష్ట్రసహాయకార్యదర్శి కిశోర్‌బాబు పాల్గొన్నారు.

## గుంటూరుజిల్లా రచయితల సంఘం సాహిత్య పురస్కారాలు 2012

కథ, కవిత ప్రక్రియలలో ప్రతి సంవత్సరం గుంటూరు జిల్లా రచయితల సంఘం ఇస్తున్న రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారాలకు ఈ ఏడు ప్రముఖ కథారచయిత, కవి దాట్ల దేవదానంరాజు రచించిన "యానాం కథలు", వర్ధమానకవి మంత్రి కృష్ణమోహన్ రచించిన "ప్రవహించే ప్రాణాలు" ఎంపికైనట్టు సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో గుంటూరులో జరగబోయే రచయితల సభలో విజేతలను 5000/-రూ॥ల నగదుతో గౌరవంగా సత్కరిస్తామని వారు తెలిపారు. ఈ పురస్కారాలకు రచనల ఎంపికలో న్యాయనిర్ణేతలుగా కథాప్రక్రియలో ప్రసిద్ధ కథా రచయిత, కవి, విమర్శకులు పాపినేని శివశంకర్, కవితా ప్రక్రియలో ప్రసిద్ధ విమర్శకులు కవి, సంపాదకులు పెనుగొండ లక్ష్మీనారాయణలు వ్యవహరించారని తెలిపారు.

## గల్పిక

# సింగపూర్‌గా మారిన సీమాంధ్ర

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన సింహపురి మహానగరం. కాపువీధిలోని స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63) నివాసం. అప్పుడే తెల్లారింది. 'ఇప్పటికింకా నా వయస్సు నిండా పదహారే' అనే పాట రింగ్‌టోన్‌తో తన సెల్‌ఫోన్ మోగడంతో వివేకాకు తక్కున మెలకువ వచ్చింది. వెంటనే ఫోన్ ఎత్తి హాల్లో... అన్నాడు. అవతల నుండి మెగాస్టార్ చిరంజీవి... వివేకా, ఈరోజు పేపర్ చూసావా అని అడిగాడు. నేను నీ ఫోన్ తోనే నిద్రలేస్తున్నాను... అంతలా కొంపలంటుకుపోయే న్యూస్ ఏముంది, కొంపదీసి రాష్ట్ర విభజన నిర్ణయాన్నిగాని కేంద్రం వెనక్కి తీసుకుందా, ఏంటి అని వివేకా అడిగాడు. దానికి చిరు.... అదేంలేదు... మన పనబాక లక్ష్మి అదిరిపోయే స్టేట్‌మెంట్ ఇచ్చింది... అయినా తినబోతూ రుచి అడగడమెందుకు... సినిమా చూసే ముందు ఎలా ఉందని అడగడమెందుకు... ముందు ఆ న్యూస్ చదువు అంటూ ఫోన్ పెట్టేసాడు. రాజూ... అంటూ వివేకా కేకేసాడు. పి.ఏ రాజు లోపలకు వచ్చాడు. ఈరోజు పేపర్ తీసుకో అని వివేకా అన్నాడు. రాజు 'ఈనాడు' పేపర్ అతని చేతికిచ్చాడు. పేపర్‌లో అక్షరాలు వివేకాకు మసకమసకగా కనిపించసాగాయి. రాజూ... గ్లాస్ తీసుకో అని వివేకా అన్నాడు. రాజూ వెళ్లి నీళ్లగ్లాస్ తెచ్చిచ్చాడు. అది చూసి వివేకాకు మండి... నేనడిగింది నీళ్ల తాగే గ్లాస్ కాదు, కళ్లకు పెట్టుకునే గ్లాస్ అని చెప్పాడు. రాజూ అలాగే వెళ్లి కళ్లద్దాలు తెచ్చిచ్చాడు. వివేకా వాటిని పెట్టుకుని పేపర్ వైపు చూసాడు... ఆయన పరిస్థితి కళ్లకు ఆపరేషన్ చేసి కట్టు కట్టినట్లుగా వుంది. ఆయనకంతా చీకటిగా వుంది. అక్షరం కనిపించడం లేదు. భయంతో... ఏంట్రా రాజూ, నాకేమీ కనిపించడం లేదన్నాడు. దానికి రాజూ... ఇంత పొద్దున్నే కూలింగ్‌గ్లాస్ పెట్టుకుంటే ఏం కనిపిస్తుంది బాస్ అని చెప్పాడు. వివేకాకు అక్కడ మండింది. మిమ్మల్నందరినీ 'నాసా'లో రాకెట్లు వదలడానికి పంపించాల్రా... నేనడిగింది రీడింగ్ గ్లాస్, కూలింగ్‌గ్లాస్ కాదని అన్నాడు. అప్పుడు రాజూ మామూలు రీడింగ్ గ్లాస్ తెచ్చిచ్చాడు. వివేకా వాటిని పెట్టుకుని పేపర్ చదివాడు. 'సీమాంధ్రను సింగపూర్‌గా మారుస్తాం' – కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి అని వున్న వార్తను చదివాడు. వివేకాకు ఒక్క నిముషం మైండ్ బ్లాక్, వైట్, రెడ్డయ్యి మళ్ళీ మామూలు స్థితికొచ్చాడు. రాష్ట్ర విభజన వల్ల సీమాంధ్ర సింగపూర్ అయిపోతుందా... అనే ఆలోచనతో వివేకా మనసు గాల్లో తేలిపోసాగింది. వెంటనే ఉండబట్టలేక పనబాక లక్ష్మికి ఫోన్ చేసాడు. అవతల ఆమె ఫోన్ ఎత్తింది. వివేకా వుండి... సారీ అమ్మ... సమైక్యాంధ్రకు మద్దతునివ్వలేదని ఇంతకాలం నిన్ను అపార్థం చేసుకున్నాం.. కాని సీమాంధ్రను సింగపూర్ చేయాలనే ఆలోచన మీకు వుండబట్టే విభజనకు మద్దతు తెలపలేక పోయారని వూహించలేకపోయాం, మా తప్పును మన్నించమ్మా అని ఫోన్ పెట్టేసాడు.

తర్వాత వివేకానే ఆనం రామనారాయణ రెడ్డి, పితాని సత్యనారాయణ, కన్నా లక్ష్మీనారాయణ, గల్లా అరుణకుమారి, జె.సి.దివాకర్‌రెడ్డి, రఘువీరారెడ్డి, గాదె వెంకటరెడ్డి, ఎం.మహీధర్ రెడ్డి, పి.బాలరాజు, ఇంకా మరికొందరు నాయకులకు ఫోన్‌చేసాడు. పనబాక లక్ష్మి మన సీమాంధ్రను సింగపూర్‌గా మార్చాలనుకుంటుంది. ఇది మన అదృష్టం. సీమాంధ్రను సింగపూర్‌గా మార్చే ప్రక్రియలో మనమూ భాగస్వాములం కావాలి. ఈ విషయంలో మనం పనబాక లక్ష్మికి అండగా నిలవాలి. ఆమె ఒక్కటే కష్టపడాలంటే కుదరదు కదా అని వివేకా చెప్పాడు. అందరూ సంతోషంతో ఒప్పుకున్నారు. సీమాంధ్రను సింగపూర్‌లా మార్చాలంటే ముందు సింగపూర్ ఎలా వుందో మనం చూడాలి... కాబట్టి మనమంతా ముందు సింగపూర్ వెళ్లొద్దామని వివేకానే ప్రతిపాదించాడు. దానికి సీమాంధ్ర నేతలంతా ఓకే అని చెప్పారు.

★★★★★

చెన్నై ఎయిర్‌పోర్టు నుండి సింగపూర్ ఎయిర్ లైన్స్ విమానంలో సీమాంధ్రనేతలంతా సింగపూర్ బయలుదేరారు. విమానం కదిలే సమయంలో ఎయిర్‌హోస్టస్ వివేకా వద్దకు వచ్చి... సార్, బెల్టు పెట్టుకోండి అని అంది. దానికి వివేకా... నేను ఇంటి వద్దే పెట్టుకుని వచ్చానమ్మా అంటూ చొక్కా ఎత్తి ప్యాంటుకున్న బెల్టు చూపించాడు. ఆమె సిగ్గుపడుతూ... నేను పెట్టుకోమన్నది ఫ్యాంటు బెల్టు కాదు సార్, సీటుబెల్టు అని అక్కడే వున్న సీటుబెల్టును అతని నడుముకు పెట్టేసి వెళ్లిపోయింది. నువ్వు పెడతావనే కదా నేను పెట్టుకోనిది అని వివేకా మనసులో అనుకున్నాడు. విమానం టేకాఫ్ అయ్యింది. గాల్లో దూసుకుపోతుంది. అప్పుడే ఎయిర్‌హోస్టస్ ఒక బండిని నెట్టుకుంటూ వస్తూ అందరికీ కాక్‌టెయిల్, బిస్కెట్లు అందించసాగింది. వివేకాకు అవేవీ నచ్చలేదు. సమోసాలు, బజ్జీలు గాని లేవా అని అడిగాడు. అలాంటివి తమ వద్ద ఉండవని ఎయిర్‌హోస్టస్ చెప్పింది. చేసేదేమీలేక వివేకా జేబులో వున్న వేరుశెనక్కాయల పొట్లం బయటకు తీసి వాటిని తిన్నాడు. కొద్దిసేపటికి జేబులో నుండి సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుని... తన పక్కనే వున్న అద్దాన్ని జరపడానికి బలంగా ప్రయత్నించసాగాడు. అది చూసి ఎయిర్‌హోస్టస్ పరుగెత్తుకుంటూ వచ్చి ఏం చేస్తున్నార్సార్ అని అడిగింది. సిగరెట్ తాగితే పొగబయటకెళ్లాలి కదమ్మా అందుకే ఈ కిటికీని జరుపుతుంటే కదలడం లేదన్నాడు. దానికి ఎయిర్‌హోస్టస్... ఇదేమన్నా ఎర్రబస్సనుకుంటున్నారా సార్, కిటికీలు జరిపి సిగరెట్లు తాగడానికి, ఎయిర్‌బస్. మీరు ఆ కిటికీని తీస్తే మనమంతా గాల్లో వుంటాం. మన ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి.. అని చెప్పి వెళ్లిపోయింది. మూడు గంటల ప్రయాణం తర్వాత సింగపూర్ ఎయిర్ పోర్టులో దిగారు. వివేకా ఆధ్వర్యంలో సీమాంధ్ర నేతల బృందం ముందుగా ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించింది. ఈ ఎయిర్‌పోర్టు చాలా బాగుంది. ఇలాంటిదే ఒకటి నెల్లూరులో కడితే సరిపోతుందని వివేకా అన్నాడు. టీ.జి.వెంకటేష్ వుండి... ఇలాంటివి నెల్లూరులో ఒకటి, కర్నూలులో ఒకటి, వైజాగ్‌లో ఒకటి కడితే మూడుప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నాడు. అందరూ కూడా దానికి సరేనన్నారు. తర్వాత అందరూ బయటకొచ్చి తమ కోసం సిద్ధంగా వుంచిన ఏ.సి బసెక్కారు. సింగపూర్ సిటీనంతా చూడసాగారు. విశాలమైన రోడ్లు, ఆకాశాన్నంటే భవనాలు, భూగర్భ రైలుమార్గం, అధునాతనమైన ఓడరేవులు, టూరిజం ప్రాజెక్టులు... అదొక అద్భుత నగరంగా వుంది. వివేకా వుండి... మనం ఇప్పుడు సింగపూర్‌ను చూసి అబ్బో అనుకుంటున్నాం... ఇంకో సంవత్సరం తర్వాత మన సీమాంధ్రను చూసి మిగతావాళ్లు కూడా ఇలాగే ఆశ్చర్యపోవాలి అని అన్నాడు. మిగతా వాళ్లు... అంతే, అంతే అని తలాడించారు. రెండ్రోజుల పాటూ సీమాంధ్రనేతలు సింగపూర్‌పై అధ్యయనం చేసారు. తిరిగి నేరుగా ఢిల్లీకి చేరుకున్నారు.

★★★★★

పనబాక లక్ష్మి నివాసం... సీమాంధ్ర నేతలంతా ఆమెతో సమావేశమయ్యారు. వివేకా మాట్లాడుతూ... తమ సింగపూర్ పర్యటన వివరాలు చెప్పాడు. సీమాంధ్రలో ఎయిర్‌పోర్టు లెక్కడ, సీపోర్టులు ఎక్కడ, టూరిజం పార్కులు, ఇంటర్నేషనల్ అక్వేరియం, భూగర్భరైలు మార్గం ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో వివరించాడు. రఘువీరారెడ్డి వుండి... మేడమ్, సీమాంధ్రను సింగపూర్‌గా మార్చడానికి ఏడాది కాలం సరిపోతుందా? అని అడిగాడు. దానికి పనబాక.. అంతకాలమెందుకు ఒక నెల చాలు అని చెప్పింది. అదెలా సాధ్యం అని జె.సి.దివాకర్‌రెడ్డి అడిగాడు. దానికి పనబాక.. అదేముంది, రాష్ట్ర విభజన జరిగాక సీమాంధ్ర రాష్ట్రం పేరును 'సింగపూర్ రాష్ట్రం' అని పేరుమారుస్తూ బిల్లును ఆమోదిస్తే సరి అని చెప్పింది. ఆ మాటకు సీమాంధ్ర నేతలందరికీ పట్టపగలే కళ్లముందు చుక్కలు కనిపించసాగాయి.

## మధుమేహంపై కవితల పోటీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని మధుమేహంపై కవితల పోటీని నిర్వహిస్తోందని ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ ఈదూరు సుధాకర్ ప్రకటించారు. 20లైన్లకు మించకుండా కవిత రచించాలని, అలాగే పదో తరగతి చదువుతున్న విద్యార్థులు "బాల మధుమేహం-ప్రమాదాలు" అనే అంశంపై రెండు పేజీలకు తగ్గకుండా వ్యాసాలు రచించి పోటీకి పంపాలని కోరారు.

వివరాలకు 93471 09266నంబరులో సంప్రదించమన్నారు. రచనలు డాక్టర్ ఈదూరు సుధాకర్, ఎన్‌సిడీ నోడల్ ఆఫీసర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, నెల్లూరు చిరునామాకు పంపమని కోరారు.


## నేత్రపర్వంగా ఉమామహేశ్వర కల్యాణం

నెల్లూరు శివశక్తి భక్తబృందం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నెల్లూరు టౌన్‌హాలులో ఉమామహేశ్వర కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. వేదపండితులు మాచవోలు రాజశేఖరశాస్త్రి, మాచవోలు రమేష్‌శర్మ, వివిధ ఆలయాలకు చెందిన వేదపండితులు శివలింగానికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరుల ఉత్సవమూర్తులను వివిధ పుష్పాలంకరణలతో వేదికపై కొలువుదీర్చారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారి, స్వామివారి గోత్రాలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. పవిత్ర అక్షింతలు, తీర్థప్రసాదాలను భక్తులకు అందజేసారు. ఈ సందర్భంగా కల్యాణఘట్టాలను బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ భక్తులకు తెలియజేశారు. దేశంలో విశిష్టమైన పంచలింగక్షేత్రాలను దర్శించుకున్న భక్తులు పరమేశ్వరుని కృపకు పాత్రులవుతారని ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సామవేదం దంపతులను, మాచవోలు రాజశేఖరశాస్త్రి, మాచవోలు రమేష్‌శర్మ, అయిదురోజుల పాటు శ్రీ గురుకృపకళాక్షేత్రం విద్యార్థులచే భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించిన అధినేత్రి సురభిగాయత్రిలను శివశక్తి భక్తబృందం గౌరవాధ్యక్షులు డా॥బి.శివప్రతాప్‌రెడ్డి, సభ్యులు శాలువాలతో సత్కరించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



## మేషం


అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము


ఆదాయ వ్యయాలు అంచనాలకు తగినట్లుండ గలవు. వృత్తి వాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. సొంత పనులందు ఆటంకాలను అధిగమిస్తారు. సభలు సమావేశాలలో పట్టువిడుపులు ప్రదర్శించండి, లేకుంటే తగాదాలు సమస్యలు రావచ్చును. ఇంట శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును. దూరప్రయాణా లుంటాయి. దైవకార్యాలలో పాల్గొనడం ఉంటుంది.

## వృషభం


కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర1, 2పాదాలు


అనుకున్న పనులు సమర్థవంతంగా జరుపుకొంటారు. వృత్తి పరంగా వ్యాపకం పెరగడం ఆదాయవృద్ధి ఉంటుంది. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు చేజార వచ్చును. వ్యాపారవర్గాలకు సామాన్య ఆదాయం ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కోర్టువ్యవహారాలు, ఆస్తి వ్యవహారాలు పరిష్కారమునకు రావచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును.

## మిథునం


మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు


ప్రముఖులు ఆత్మీయులను కలుసుకొంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. మీ సలహాలు, సహాయం వల్ల ఇతరులకు మేలు కలుగుతుంది. హామీలు ఇవ్వకండి. స్థిరాస్తులపైన పెట్టుబడి పైన ఆదాయం పెరుగుతుంది. అదనపు ఖర్చులు బలంగా ఉండినా ఇబ్బందులుండవు.

## కర్కాటకం


పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తివ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. పెద్దలతో పరిచయాలు, అనుకున్న పనులు సక్రమంగా జరగడం, మీపీద ఆరోపణలు తొలగిపోయి గౌరవమర్యాదలు పెరగడం ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు నిర్వహిస్తారు. మీ సూచనలు సలహాలతో ఇతరులు లాభపడతారు. ఉద్యోగులకు బాధ్యతలు మారడం పని భారం పెరుగుతుంది.

## సింహం


మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తివ్యాపారాలలో మంచి అభివృద్ధి అవకాశాలుంటాయి. కొత్తవ్యాపార ప్రారంభాలుంటాయి. స్థిరాస్తుల కొనుగోలు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతాయి. అనుకున్న పనులను సులువుగా జరుపుకొనడం, ధైర్యంగా నిర్ణయాలు చేయడం జరుగుతుంది. ఉద్యోగులకు పనిభారం పెరగడం, అధికారులతో సఖ్యత బాగుంటుంది. యూనియన్ కార్యకలాపాలలో పాల్గొనడం జరుగుతుంది.

## కన్య


ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వాహనాలు నడిపేటప్పుడు, కరెంటు యంత్రాల పనులు చేసేటప్పుడు జాగ్రత్త అవసరం. స్థలాలు, భూములు లావాదేవీలు వాయిదా వేసికొంటే మంచిది. వృత్తి వ్యాపారాల వ్యాపకం బాగుండి ఆదాయం పెరుగుతుంది. అయితే అవసరాలకు ఋణంచేయవలసి రావచ్చును. అనుకున్న పనులు సమర్థవంతంగా చేస్తారు. స్థిరాస్తులు పెట్టె మీద లాభాలుంటాయి.


బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 01.11.2013 నుండి
తేది. 07.11.2013 వరకు

ఈ వారము మేషంలో కేతువు, మిథునంలో గురువు, సింహంలో కుజ, కన్య తుల వృశ్చిక ధనుస్సు రాశులలో చంద్రుడు, ధనుస్సులో శుక్రుడు, తులలో రవి బుధ శని రాహువులు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 1 శుక్రవారం రాత్రికి తెల్లవారితే శనివారం నరకచతుర్దశి.

తేది 3 ఆదివారం దీపావళి అమావాస్య.

### ముహూర్తములు

ముహూర్తములు లేవు.

### ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తే.ది. 01 | శుక్ర | త్రయోదశి | రా॥గం. 7.59ని॥ |
| తే.ది. 02 | శని | చతుర్దశి | రా॥గం. 7.30ని॥ |
| తే.ది. 03 | ఆది | అమావాస్య | రా॥గం.6.28ని॥ |

### కార్తీక మాస శుక్లపక్ష తిథులు


| | | | |
|---|---|---|---|
| తే.ది. 04 | సోమ | పాడ్యమి | సా॥గం. 5.10ని॥ |
| తే.ది. 05 | మంగళ | విదియ | సా॥గం. 3.22ని॥ |
| తే.ది. 06 | బుధ | తదియ | ప॥గం.1.20ని॥ |
| తే.ది. 07 | గురు | చతుర్థి | ప॥గం.11.08ని॥ |

## తుల


చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు


ఆలోచనలందు తడబడినా ధైర్యంగా నిర్ణయాలు తీసికొంటారు. డబ్బు, విలువైనవస్తువులు జాగ్రత్తగా కాపాడుకొనండి. ఆహ్వానాలు నోటీసులు అందుతాయి. వృత్తివ్యాపారాలలో వ్యాపకం బాగుండి, ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. యజమానులకు వర్కర్లతో స్వల్పంగా సమస్యలు రావచ్చును. శుభకార్యములందు పాల్గొనడం జరుగుతుంది. అనుకోని ఆర్థిక అవసరాలుండును.

## వృశ్చికం


విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ


ఆర్థికవ్యవహారాలలోను, పెట్టుబడులందు ఆచితూచి వ్యవహరించండి. మంచి వ్యాపారావకాశాలు చేజార వచ్చును. డబ్బు పోగొట్టుకొనే అవకాశం ఉన్నది. కోర్టు వ్యవహారాలందు అనుకూలత తక్కువ. ఆర్థిక నిర్ణయాలలో ఇతర పెద్దల సలహాలు పొందడం మంచిది. అనుకోని ప్రయాణాలుంటాయి. పట్టుదలతో శ్రమించి పనులు కొనసాగిస్తారు. మిత్రులతో విభేదాలు రాగలవు.

## ధనుస్సు


మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము


ఆర్థిక, వ్యవహార పరంగా నిర్ణయాలు తీసికొనడంలో సమర్థత చూపుతారు. అనుకున్న పనులను విద్యోక్త విధంగా నెరవేర్చుకొంటారు. వృత్తివ్యాపారాలలో మంచి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పెట్టె మీద ఆదాయం లాభాలుంటాయి. పెండింగ్ సమస్యలు పరిష్కారంకాగలవు. ఉద్యోగార్థులకు చిన్నచిన్న అవకాశాలు దొరకగలవు.

## మకరం


ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యాపార అభివృద్ధికి కొత్త పథకాల ఆలోచనలుంటాయి. ఆర్థికంగా కొద్ది ఇబ్బందులున్నా సామాన్య ఆదాయానికిలోపం ఉండదు. పిల్లల కారణంగా ఏదోఒక సమస్య ఏర్పడవచ్చును. అదనపు ఖర్చులు పెరుగుతాయి. ఇతరుల వల్ల మాటలు పడవలసిరావచ్చును జాగ్రత్త పడడం మంచిది. రావలసిన బాకీలు వాయిదా పడగలవు. అనుకోని ప్రయాణాలుంటాయి.

## కుంభం


ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తివ్యాపారాలలో రాణిస్తారు. ఆదాయం అభివృద్ధి బాగుంటుంది. తొందరపాటు నిర్ణయాలు, దురుసుగా మాట్లాడటం చేయకండి. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. పేర్ల మీద లాభాలుండగలవు. ఉద్యోగులకు నిర్వహణ సామర్థ్యం బాగుంటుంది మరియు యూనియన్, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కొత్తవ్యాపారాలు చేయడానికి అవకాశంబాగుంటుంది.

## మీనం


పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆదాయవ్యయాలు సంతృప్తికరం, భూములు స్థలాలు కొనుగోలుకై డబ్బు సమకూర్చుకొనే పనిలో ఉంటారు. అవసరాలకు ఋణసహాయాలు పొందుతారు. వ్యవహారాలలో ఆటంకాలను అధిగమించడం, కృషికి సేవకు తగిన గుర్తింపు లభించడం జరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త పడాలి.

# పారిశుద్ధ్యాన్ని పరిరక్షించాలి

## అధికారులు మండల కేంద్రాల్లోనే ఉండాలి

**- జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్**


సమీక్షాసమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీకాంత్, పక్కన జేసీ లక్ష్మీకాంతం, ఏజేసీ పెంచలరెడ్డి తదితరులు

నెల్లూరు జిల్లాలోని ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించేందుకు పంచాయతీ కార్యదర్శులతో పాటు ఎంపీడీఓలు, తహశీల్దార్లు మండల కేంద్రాల్లోనే ఉండాలని ఇష్టంలేకుంటే ఇంకో ఉద్యోగానికి వెళ్ళిపోవాలని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అధికారులనుద్దేశించి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గతనెల 26న నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో పారిశుద్ధ్యం, జబ్బులు, రచ్చబండ, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్యను పెంచడం, చెరువుల నీటితీరు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. దోమల నివారణకు ప్రత్యేకచర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలితే వెంటనే వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు స్థలాలను సేకరించాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులసంఖ్య పెంచేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. నవంబర్ 6నుంచి రచ్చబండ-3కార్యక్రమం మొదలవుతుందని ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికి రేషన్‌కార్డులను అందజేసేందుకు వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేయాలన్నారు.

ఈ సమావేశంలో జేసి బి.లక్ష్మీకాంతం, ఏజేసి సిహెచ్ పెంచలరెడ్డి, జెడ్పీ సిఇఓ జితేంద్ర, నెల్లూరు ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, డిఆర్‌డిఏ పిడి వెంకటసుబ్బయ్య, హౌసింగ్ పిడి వెంకటేశ్వరరావు డిఎస్‌ఓ ఉమామహేశ్వరరావు, కార్పొరేషన్ కమీషనర్ జాన్‌శ్యాంసన్ డ్వామా పిడి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# మనగుడి 11 నుంచి ప్రారంభం

## దేవాదాయ, ధర్మాదాయశాఖ ఏసీ రవీంద్రరెడ్డి



మనగుడి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వేగూరు రవీంద్రరెడ్డి

తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచారమండలి, దేవాదాయ ధర్మదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 11 నుంచి 17వతేదీ వరకు నెల్లూరు జిల్లావ్యాప్తంగా మనగుడి కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు దేవాదాయ, ధర్మాదాయశాఖజిల్లా సహాయ కమీషనర్ వేగూరు రవీంద్ర రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరు దర్గామిట్ట టీటీడి కల్యాణమండపంలో అందుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. హిందూధర్మాన్ని వాడవాడలా ప్రచారం చేయాలనే సంకల్పంతో నాలుగేళ్ళుగా టీటీడి నేతృత్వంలో మనగుడి విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. విశిష్టమైన కార్తీకమాసంలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. 11వతేదీన జిల్లాలో అన్ని దేవాలయాల్లో కార్తీక వనభోజనాలు ఏర్పాటుచేశామన్నారు. శైవక్షేత్రాల్లో లక్షబిల్వార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూధర్మప్రచారమండలి అధ్యక్షుడు సివి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి, కార్యదర్శి ధనుంజయ, కో ఆర్డినేటర్ యం.శ్రీహరి, ప్రాజెక్ట్ అధికారి హరనాథ్, సభ్యులు గిరిజమ్మ, ఆలూరి శిరోమణిశర్మ, భానుప్రకాష్, రమేష్, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో డెంగీ పంజా

నెల్లూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో డెంగీ వ్యాధి పంజా విసరడంతో పల్లెల్లోని పలువురు డెంగీ బాధితులు చికిత్స నిమిత్తం నెల్లూరు, చెన్నై నగరాలకు పరుగులు తీస్తున్నారు. చెన్నైలోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జిల్లాలోని సైదాపురం మండలంలో విషజ్వరాలు తీవ్ర రూపందాల్చాయి. అక్కడి డాక్టర్ ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులను పరీక్షించి ఇద్దరికి డెంగీ జ్వరం సోకిందని నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేసారు.

మరో ఐదు మందిని చెన్నై వెళ్ళాలని సూచించడంతో వారు చెన్నై ఆసుపత్రిలో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటున్నారు. విషజ్వరాలు ప్రబలడంతో వందల మంది ఆసుపత్రులకు రావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి.

## యువజనోత్సవాలకు

# కళాకారుల ఎంపిక

నెల్లూరుజిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా నవంబర్ 30న జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కళాకారులను ఎంపికచేయనున్నట్లు సెట్నెల్ సిఇఓ ఎంవి సుధాకర్ తెలిపారు. కోవూరు నియోజకవర్గ స్థాయి యువజనోత్సవాలు నవంబర్ 5న జరుగుతాయన్నారు.

ఈ ఎంపికలు గంగవరం గ్రామంలోని గీతాంజలి కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 నుంచి 35సంవత్సరాలలోపు కళాకారులు అర్హులన్నారు. శాస్త్రీయనృత్యం (భరతనాట్యం, కూచిపూడి, కథక్, మణిపూరి, ఒడిస్సా) జానపదనృత్యం, జానపద సంగీతం, ఏకాంకికనాటిక, కర్ణాటక, హిందూస్థానీగాత్రం, వేణువు, మృదంగం, తబలా, వీణ, సితార, గిటార్, హార్మోనియం, వక్తృత్వం, క్విజ్, పాటలు, డాన్స్, మార్షల్ ఆర్ట్స్, ఫ్యాన్సీ డ్రెస్, చిత్రలేఖనం, వయోలిన్, మిమిక్రీ, మ్యూజిక్, వ్యాసరచన, ఏకపాత్రాభినయం, వెస్ట్రిలాక్విజం తదితర 30అంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో ఎంపికైన కళాకారులు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రెండు, మూడవస్థానాలు సాధించిన కళాకారులకు ధృవీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. ఆసక్తిగల కళాకారులు ఈనెల 4వతేదీలోగా అన్ని వివరాలతో యువజన సంక్షేమ కార్యాలయం, ఏకె నగర్‌లో దరఖాస్తు చేసు కోవాలన్నారు. ఇతర వివరాలకు 77027 70037కు ఫోన్‌చేయాలన్నారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరుజిల్లా రెవెన్యూ అధికారి బి.రామిరెడ్డి - నాగేంద్రమ్మల కుమార్తె శిరీష-యశ్వంత్‌ల కల్యాణం అక్టోబర్ 25వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



రైల్వే కాంట్రాక్టర్ వ్యాసంగి బాలభాస్కర్‌రావు - అనుసూయల కుమార్తె మానస - విజయ్‌కుమార్‌ల వివాహం అక్టోబర్ 18వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కల్యాణమండపంలో ఘనంగా జరిగింది. కొత్త దంపతులకు లాయర్ శుభాభినందనలు.

## పెనుభూతమౌతోంది

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణపై నిర్ణయం తీసుకున్నాకే జగన్‌కు బెయిల్ వచ్చింది. అప్పటికే తెలంగాణలో కాంగ్రెస్‌తో, సీమాంధ్రలో జగన్‌తో కాంగ్రెస్ మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుందని, ఈ రెండుపార్టీలు రేపు కేంద్రంలో కాంగ్రెస్‌కు మద్దతునిస్తాయనే ప్రచారం వచ్చింది. జగన్‌పై మొన్నటివరకు ఉక్కుపాదం మోపిన సిబిఐ కేసులు నీరుగార్చడం, జగన్‌కు బెయిల్‌వచ్చి బయటకు రావడం జరిగింది. అయితే జగన్‌కు చట్టబద్ధంగా ఆ సమయానికి బెయిల్ వచ్చినా, సోనియా ఆశీస్సులతోనే ఆయనకు బెయిల్ వచ్చిందన్న ప్రచారం బలంగా జరిగింది. జైలు నుండి బయటకొచ్చాక ఏర్పాటుచేసిన తొలి ప్రెస్‌మీట్‌లో జగన్ రాష్ట్ర విభజనచిచ్చు పెట్టిన సోనియాపై విమర్శలు చేయకపోవడం చర్చనీయాంశమైంది. జగన్, విజయమ్మలు సోనియాను ఏమీ అనకుండా విభజనకు సై అంటూ లేఖ ఇచ్చాడని చంద్రబాబుపై విమర్శల దాడికి దిగడాన్ని కూడా పలువురు ప్రశ్నించారు. విభజన నిర్ణయం తీసుకున్న సోనియాగాంధీని ఎందుకు వదిలేసారని జగన్‌పై ప్రశ్నాస్త్రాలు సంధించారు. సోనియాను ఏమీ అనడం లేదంటే మీమధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ కుదిరినట్లేనా? అని తెలుగుదేశం వాళ్ళు కూడా ప్రశ్నించసాగారు. ఈ అనుమానాలను తిప్పికొట్టే విధంగా సమైక్యశంఖారావం సభలో జగన్ సోనియా పౌరసత్వాన్నే ప్రశ్నించారు. మీ భారతీయ పౌరసత్వాన్ని రద్దుచేసి మిమ్మల్ని ఇటలీకి వెళ్లిపొమ్మంటే మీకెలా వుంటుందని సోనియాకే నేరుగా ప్రశ్నాస్త్రం సంధించారు. ఇది చాలా ధైర్యంగా అడిగిన ప్రశ్న. ఒకవేళ కాంగ్రెస్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ వుంటే జగన్ ఇంత ధైర్యంగా సోనియాగాంధీని ప్రశ్నించి ఉండేవాడా? అనే చర్చ రాజకీయవర్గాల్లో రేగింది. తాను కాంగ్రెస్‌తో ములాఖత్ కాలేదని చెప్పడానికే జగన్ ఈ విధంగా సోనియాపై యుద్ధానికి దిగాడు. అయితే కాంగ్రెస్ నాయకులే ఈ విధమైన అనుమానాలు బలపడేలా చేస్తున్నారు. ఎంపీలు లగడపాటి, రాయపాటి సాంబశివరావులు తమ పార్టీ జగన్‌తో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుని తమను అనాథల్ని చేసిందని వాపోవడం జరిగింది. ఈమధ్య జేసీ దివాకర్‌రెడ్డి, ఆనం వివేకానందరెడ్డి లాంటి నాయకులు కూడా మ్యాచ్‌ఫిక్సింగ్ అనుమానాలు బలపడేలా మాట్లాడారు. వైకాపా మా డిఎన్ఏ అంటూ గతంలోనే దిగ్విజయ్, గులాంనబీ ఆజాద్, వీరప్పమొయిలీ వంటి కేంద్ర కాంగ్రెస్ నేతలు ప్రకటించి వున్నారు. వీటన్నింటి దృష్ట్యా కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ వేర్వేరుకాదనే ఒక ప్రచారం గ్రామస్థాయిలలోకి కూడా చొచ్చుకుపోతుంది. ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మితే కాంగ్రెస్‌తో కలిసి వైకాపా కూడా మునిగే అవకాశముంది. కాబట్టి జగన్ సత్వరం దీనిపై స్పందించి కాంగ్రెస్‌తో ఇప్పుడే కాదు భవిష్యత్‌లో కూడా పొత్తు పెట్టుకునేది లేదని స్పష్టంచేస్తే మ్యాచ్‌ఫిక్సింగ్ సందేహాలకు తెరపడుతుంది.

## టిక్కెట్లు కూడా ఫ్రీ

(2వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో పరిస్థితి ఏ విధంగా ఉండబోతుంది. అడిగినవాళ్లకు లేదనకుండా ఇప్పుడు పదవులిచ్చినట్లే రేపు టిక్కెట్లు కూడా ఇవ్వబోతున్నారు. సీమాంధ్రలో కాంగ్రెస్ పూర్తిగా ఎత్తిపోతుంది. జిల్లాలో కూడా ఆనం బ్రదర్స్ తప్పితే కాంగ్రెస్‌లో బలమైన నాయకులెవరూ మిగిలేటట్లు లేరు. జిల్లాలోని లోక్‌సభకు, అసెంబ్లీలకు పోటీచేసే అభ్యర్థులు కనిపించరు. కాబట్టి ఈసారి అడిగిన వారికి లేదనకుండా కాంగ్రెస్ టిక్కెట్లు ఫ్రీగా దొరకడం ఖాయం.

### వైయస్ఆర్‌సిపి జిల్లా ప్రచార కన్వీనర్‌గా...

## సూరి పాండురంగారెడ్డి



వైయస్ఆర్‌సిపి జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్‌గా సూరి పాండురంగారెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారని రాష్ట్ర ప్రచారకమిటి కోఆర్డినేటర్ టిఎస్‌వి జయచందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పాండురంగారెడ్డి విద్యార్థిదశ నుండి విద్యార్థి రాజకీయాలలో చురుకుగా పాల్గొనడమే కాకుండా విఆర్ కాలేజీ విద్యార్థి కమిటీకి ఉపాధ్యక్షులుగా పోటీచేశారు. నెల్లూరులో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేశారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డిగారి పరిపాలన పట్ల ఆకర్షితులై రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్‌పార్టీలో పనిచేస్తూ రాజశేఖర్‌రెడ్డి మృతితో ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. జిల్లాలో జగన్‌మోహన్‌రెడ్డి జరిపిన ఓదార్పుయాత్రలో ఆయన పాల్గొన్నారు. నాటి నుండి ఆయన అనుచరుడిగా పనిచేస్తూ జిల్లాలోని 10 నియోజకవర్గాల సమన్వయకర్తలతో పాటు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజామోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ కన్వీనర్ మేరిగ మురళీలతో సంబంధాలు కలిగి పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్నారు. ప్రచార కమిటీ పదవికి అన్ని విధాలా న్యాయం చేస్తానని, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు.

## డిపిఆర్‌ఓ పదవీవిరమణ

జిల్లా పౌరసంబంధాల శాఖాధికారి యం.కమలాకర్‌రెడ్డి గురువారం పదవీవిరమణ చేసారు. 2011 ఫిబ్రవరిలో ఆయన డిపిఆర్‌ఓగా నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. 1985లో నెల్లూరులోని డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. పదవీవిరమణ చేసిన కమలాకర్‌రెడ్డి స్థానంలో డివిజనల్ పిఆర్‌ఓ వెంకటేశ్వరరావును నియమించారు.

## రైజింగ్‌స్టార్ రోహిత్

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుసినిమా రంగంలో నెల్లూరోళ్ళకు ఒక ప్రత్యేకత వుంది. నిర్మాతగా, దర్శకులుగా, రచయితలుగా, కమెడియన్‌లుగా, విలన్లుగానే కాకుండా హీరోలుగా కూడా నెల్లూరు నుండి వెళ్ళిన వాళ్ళు చాలామంది సినీ పరిశ్రమలో ప్రత్యేకస్థానాలని సంపాదించుకున్నారు. నేటి మెగాస్టార్ చిరంజీవి సినీ ఆరంగేట్రం జరిగింది నెల్లూరు నుండే. ఆయన సినీరంగ ప్రవేశానికి ముందు పెరిగింది, చదివింది నటనకి పునాదులు వేసుకుందీ నెల్లూరు నుండే.

'లవకుశ' తీసిన అల్లారెడ్డి శంకర్‌రెడ్డి, భార్గవ్ ఆర్ట్స్ గోపాల్‌రెడ్డి, 'ఖైదీ' నిర్మించిన తిరుపతిరెడ్డి... వీళ్ళంతా నెల్లూరు నిర్మాతలే. ఇక నాగభూషణం, రాజనాల, నెల్లూరు కాంతారావు వంటి విలన్లదీ నెల్లూరే. మనసుకవి ఆత్రేయ, మనకవి వెన్నెలకంటి, మహాకవి "మల్లెమాల"లు కూడా నెల్లూరీయులే. ఇక నవ్వులరాజు రమణారెడ్డి విషయం చెప్పనే అవసరం లేదు. దర్శకులుగా ముత్యాల సుబ్బయ్య, కోదండ రామిరెడ్డి, పి.యస్.రామచంద్రరావు, సత్యారెడ్డి... వీళ్ళంతా నెల్లూరు ముద్దుబిడ్డలే. హీరోయిన్ల విషయానికొస్తే కళాభినేత్రి వాణిశ్రీ, రమ్యకృష్ణ, అశ్విని వంటి వాళ్ళు ఎందరో వున్నారు. ఇక ప్రపంచప్రఖ్యాత గాయకుడు యస్.పి.బాలసుబ్రహ్మణ్యం సంగతి అందరికీ తెలిసిందే.

ఇప్పుడు నెల్లూరు నుండి మరోహీరో "రోహిత్" "దిల్ దివానా" సినిమా ద్వారా వెండితెరకు పరిచయం కాబోతున్నాడు. రోహిత్ నెల్లూరు యస్.ఆర్.కె.స్కూల్‌లో యల్‌కెజి నుండి పదవతరగతి వరకూ చదువుకున్నాడు. నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి తిరుపతిలో బి.బి.ఎ యల్.యల్.బి చేశాడు.

తండ్రి వారసత్వం కోసం లా డిగ్రీ పుచ్చుకున్న రోహిత్ ఆశయం ఆకాంక్ష మాత్రం సినిమాహీరో కావడమే. చిన్నప్పటినుండీ అన్నిట్లో ఫస్ట్ వుండే రోహిత్ ఇప్పుడు సినిమాల్లో కూడా తనను తాను రుజువుచేసుకోవడానికి తపన పడుతున్నాడు.

శేఖర్‌కమ్ముల దగ్గర శిష్యరికం చేసిన తుమ్మ కిరణ్ రోహిత్ మొదటి సినిమాకు దర్శకుడు కావడం రోహిత్ అదృష్టమైతే, దగ్గుపాటి రామానాయుడి మనుమడు దగ్గుపాటి అభిరామ్ తన స్నేహితుడు కావడం తన లక్కంటాడు రోహిత్. రామానాయుడు కుటుంబ ఆశీస్సులు పుష్కలంగా లభించడంతో పాటు రోహిత్‌లో కావాల్సినంత టాలెంట్ వుండడంతో "దిల్ దివానా" సినిమాలో పూర్తిస్థాయి రోల్ వున్న హీరోగా పరిచయం కాబోతున్నాడు.

శ్రీ భావనా ఫిల్మ్ బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమాని రాజారెడ్డి నిర్మిస్తుండగా రోహిత్‌తో పాటు రాజ్‌అర్జున్ రెడ్డి మరోహీరోగా నటిస్తున్నాడు. అభాసింఘాల్, నేహా దేశ్‌పాండేలు హీరోయిన్లుగా ఈ ఇద్దరు హీరోల సరసన మురిపించబోతున్నారు. నాగబాబు కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. త్వరలోనే ఈ "దిల్ దివానా" తెలుగు సినీప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

రోహిత్ తండ్రి యం.రవీంద్రరెడ్డి అడ్వకేటుగా నెల్లూరీయులకు చిరపరిచితుడే. "లాయర్"గా ఆయనకి మంచి పేరుంది. చిన్నప్పటినుండి హీరో కావాలన్న తన కొడుకును ఓ వైపు ప్రోత్సహిస్తూనే మరోవైపు తనకిష్టమైన లా కోర్సును కూడా పూర్తిచేయించాడు రవీంద్రరెడ్డి. నాన్న కోరికని పూర్తిచేసి ఇప్పుడు తన ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి మూడుసంవత్సరాలుగా హైదరాబాదులో ప్రయత్నాలు సాగించిన 'రోహిత్' కల కూడా త్వరలో నెరవేరబోతుంది. రోహిత్ మంచి హీరోగా నెల్లూరీయులు గర్వించే స్థాయిలో ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులందిస్తోంది "లాయర్".

### కాలధర్మం

## దేవిరెడ్డి రాణిప్రమీల



ఆధ్యాత్మిక చింతనాపరురాలు, ఎన్నో దేవస్థానాలు, ఆశ్రమాలలో భక్తి కార్యక్రమాలకు భూరివిరాళాలందించిన దేవిరెడ్డి రాణిప్రమీల(61) అక్టోబర్ 27వ తేదీ దైవసన్నిధి చేరారు. ఆమె నెల్లూరు మునసబుగా పనిచేసిన దేవిరెడ్డి ఉమామహేశ్వరరెడ్డి కోడలు. ఆమెకు ముగ్గురు కుమారులు. నెల్లూరు దండువారివీధిలోని నరసింహస్వామి దేవస్థానంలో జరిగే నిత్యపూజలకు అవసరమయ్యే ఖర్చును ఆమే విరాళంగా అందించారు. మళయాలస్వామి మఠంలో జరిగే సత్సంగ కార్యక్రమాలలోనూ ఆమె ముఖ్యపాత్ర పోషించేవారు. ఏర్పేడులోని వ్యాసాశ్రమంలో జరిగే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమంలోనూ ఆమె సామాన్య భక్తురాలిగా సేవలందించారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది "లాయర్".

PDF Compressor Free Version



# మూ'వీ'క్షణం








## తెరమీదకు మంచు మునెమ్మ

మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మీప్రసన్న సరికొత్త ప్రయోగాలతో తెలుగుతెరపై తనకంటూ ఒక ప్రత్యేకతను సృష్టించుకుంది. ప్రస్తుతం ఈమె 'చందమామ కథలు' అనే సినిమా షూటింగ్‌లో బిజీగా వుంది. 'ఊకొడతారా ఉలిక్కిపడతారా', 'గుండెల్లో గోదారి' సినిమాల్లో డీగ్లామర్ పాత్రల్లో నటించి సినిమాలు ఫ్లాప్‌లైనా తాను మాత్రం పేరు తెచ్చుకుంది. ఇలాగే రాయలసీమ ప్రాంతంలో అప్పట్లో గుత్తేదారులకు అడ్డం తిరిగిన మునెమ్మ అనే ఒక వీర మహిళ కథతో సినిమా తీయడానికి లక్ష్మీ ఆసక్తి చూపుతుంది. తను ఆ క్యారెక్టర్ వేస్తే ఎలా వుంటుందో చూసుకోవడానికి ఒక ఆర్టిస్ట్‌తో పై చిత్రంలో మాదిరిగా స్కెచ్ వేయించుకుంది. జబ్బలపై పచ్చబొట్లు పొడిపించుకుని దుష్టులతో పోరాడే ఒక వీరనారీ గెటప్‌లో లక్ష్మీ బాగానే కనిపిస్తుంది.

## రామయ్యా... నీ దారేదయ్యా?

'రామయ్యా వస్తావయ్యా' బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో జూనియర్ ఎన్టీఆర్ పరిస్థితి అయోమయంగా మారింది. సినిమా పరిశ్రమలోనే కాదు నిజజీవితంలో కూడా ఆయనకు సమస్యలు తెచ్చిపెట్టింది. గతంలో ఎన్టీఆర్‌కు వెన్నుదన్నుగా నిలిచిన తెలుగుదేశం యూత్‌వింగ్ అంతా కూడా ఇప్పుడు దూరంగా వుంది. కనీసం ఈ సమయంలో అయన ఒక్క హిట్ అన్నా కొట్టకపోతే యూత్ అంతా దూరమైనట్లే!

## సంతకం పెట్టని పవర్



పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబులు తాము తెలుగుదేశంపార్టీలో చేరుతారని వచ్చిన వార్తలను నాగబాబు ఖండించారు. తాము వృత్తిలో బిజీగా ఉన్నామని, రాజకీయాలపై ఆసక్తి లేదని చెప్పాడు. అయితే ఇలా విడుదలచేసిన పత్రికా ప్రకటనపై పవన్ సంతకం చేయడానికి నిరాకరించాడట!

## కత్తితో కటీఫ్

ఒకప్పుడు లేడీసూపర్‌స్టార్ విజయశాంతి హీరోయిన్ ఓరియెంటెడ్ పాత్రలతో అదరగొట్టింది. ఇప్పుడు అనుష్క కూడా అదే దారిలో వుంది. 'అరుంధతి', 'వేదం' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, త్వరలో 'వర్ణ', 'రుద్రమదేవి' చిత్రాలలోనూ తెరమీదకు రాబోతుంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'వర్ణ' సినిమా ఆడియో విడుదల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇక నుంచి కత్తిపట్టే సినిమాలు చేయనని చెప్పి అందరినీ షాక్‌కు గురిచేసింది. అయితే కత్తి పట్టకపోవడానికి కారణాలు మాత్రం వెల్లడించలేదు. నా మొదటి సినిమా నుండి దర్శకులు, నిర్మాతలు నాపై నమ్మకంతో మంచి పాత్రలు ఇచ్చారని, కాబట్టే మంచి సినిమాలు చేయగలిగానని ఆమె చెప్పారు. 'వర్ణ' చిత్రం ద్వారా ఓ మంచి పాత్రను చేసాననే ఫీలింగ్ తనకు కలిగిందన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు



### గ్రీవెన్స్‌సెల్‌కు...
## అర్జీల వెల్లువ



ఆర్డీఓకు అర్జీలను సమర్పిస్తున్న ప్రజలు

గూడూరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు అర్జీలు వెల్లువగా వచ్చాయి. తమ సమస్యలు పరిష్కరించాలని, తహశీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరిగి ఇక్కడకు వచ్చామని అర్జీదారులు ఆర్డీఓ మధుసూదనరావుకు మొరపెట్టుకున్నారు. గత రెండు నెలలుగా సమైక్యాంధ్ర ఉద్యమంలో రెవెన్యూ అధికారులు పాల్గొనడంతో పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోక అలాగే ఉండిపోయాయని పలు మండలాల ప్రజలు వాపోయారు. అధిక సంఖ్యలో ప్రజలు ఆర్డీఓ కార్యాలయం చేరుకుని అర్జీలు ఇచ్చి తమకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు.

### శాంతి భద్రతలను కాపాడని
## యూపీఏ ప్రభుత్వం గద్దెదిగాలి
### -: ఏబీవీపీ డిమాండ్ :-

శాంతి భద్రతలను కాపాడని యూపీఏ ప్రభుత్వం వెంటనే గద్దెదిగాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మల్లికార్జున డిమాండ్ చేసారు. గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఆదివారంనాడు పాట్నాలో ఉగ్రవాదుల ఘటనను నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో యూపీఏ దిష్టిబొమ్మను దహనం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాదులు పెట్రేగిపోయి విధ్వంసాలు సృష్టిస్తుంటే యూపీఏ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ డివిజన్ కార్యదర్శి మనోజ్, రంజిత్‌కుమార్, వాసు, విజయ, దేవేంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వర్షాలకారణంగా దెబ్బతిన్న
## రోడ్లకు మరమ్మత్తులు చేయండి

గూడూరు రూరల్ పరిధిలోని పలు గ్రామాలలో వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు గూడూరు ఆర్అండ్‌బి ఈఈ గంగాధర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కోర్టు సెంటర్ నుంచి తిప్పవరప్పాడు వెళ్లే రోడ్డుతో పాటుగా తిప్పవరప్పాడు క్రాస్ రోడ్డు నుంచి వెంకటగిరికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఇకనైనా అధికారులు స్పందించి రోడ్ల బాగుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారు సునీల్‌రెడ్డి, మగ్దూం మొహిద్దీన్, రవి, ప్రసాద్, సలీం, ఎండి అబ్దుల్, మహి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం సేవించి వాహనాలు నడిపితే...
## కఠిన చర్యలు - సిఐ ఉప్పాల



బ్రీతింగ్ ఎన్‌లైజర్‌తో పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు పట్టణంలో సోమవారం నాడు టవర్‌క్లాక్ వద్ద సిఐ ఉప్పాల సత్యనారాయణ బ్రీతింగ్ ఎనలైజర్ ద్వారా మద్యం సేవించి వాహనాలను నడిపే వారికి పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలా మద్యం సేవించి డ్రైవింగ్ చేసే వారికి జరిమానా విధించడం జరుగుతుందని మద్యం సేవించి నడిపే వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు వాహనాలను సీజ్‌చేసి కోర్టుకు పెడతామని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. ఆయన వెంట ఒకటవపట్టణ ఎస్సై షేక్‌షరీఫ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## శంఖారావం మార్మోగింది
### విజయానికి కారకులైన వారికి కృతజ్ఞతలు తెలిపిన వైయస్సార్సీపి నేతలు

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గతనెల 26న జరిగిన సమైక్యశంఖారావం సభకు వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, వైఎస్సార్ అభిమానులకు సమైక్యవాదులకు వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్తలు డాక్టర్ బాలచెన్నయ్య, పాశం సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత బత్తిని విజయకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాన్ని విభజన చేయడం తగదని, సమైక్యంగానే ఉంచాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సమైక్య శంఖారావం విజయవంతమైందని అన్నారు. అధినేత చేపట్టిన కార్యక్రమానికి హాజరయ్యేందుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వచ్చారన్నారు. రాష్ట్ర విభజన ప్రకటన వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు జేఏసీ నాయకులతో కలసి వినూత్న రీతిలో నిరసనలు తెలిపామన్నారు. సమైక్య శంఖారావాన్ని తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఢిల్లీ పెద్దలకు వినిపించారని అన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించండి
### - తహశీల్దార్ మైత్రేయ



తహశీల్దార్ మైత్రేయకు అర్జీలు సమర్పిస్తున్న ప్రజలు

గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నాడు గ్రీవెన్స్ డే సందర్భంగా మండల పరిధిలోని పలుగ్రామాల నుంచి అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ తహశీల్దార్ మైత్రేయకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని విందూరు, చెన్నూరు, గొల్లపల్లి, నెర్నూరు, కందకూరు, కొండాగుంట, కాంద్ర నుంచి వచ్చిన అర్జీదారులు ఫించను రేషన్‌కార్డుల కోసం మరియు భూమి సమస్యలు కోసం వచ్చిన వారికి న్యాయం చేయాలని కోరారు.

## ప్రజల్లోకి చొచ్చుకుపోండి...


గూడూరు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు బత్తిని విజయకుమార్ మంగళవారం హైదరాబాద్‌లోని తమ నాయకుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ఆయన ఇంట్లో కలిసారు. గూడూరు నియోజకవర్గంలో తాము చేస్తున్న సేవాకార్యక్రమాల గురించి జగన్మోహన్‌రెడ్డికి విజయకుమార్ వివరించారు. పార్టీ కోసం తాము ఏ విధంగా పనిచేస్తూ ప్రజలమధ్యకు పోతుంది చెప్పారు. ప్రజల్లో నాయకులుగా గుర్తింపు తెచ్చుకోవాలంటే వారి సమస్యలు గుర్తించి, పరిష్కరించడమే ప్రధానమని ఈ సందర్భంగా జగన్ సూచించారు. సమైక్యశంఖారావం సభను విజయవంతం చేసిన గూడూరు ప్రజానీకానికి జగన్ కృతజ్ఞతలు తెలిపారు.



అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పదోన్నతిపై వెంకటగిరికి వెళుతున్న సిహెచ్.రాజశేఖరరెడ్డిని సన్మానిస్తున్న గూడూరు ఎల్ఐసి బ్రాంచ్‌మేనేజర్ రామూచౌహాన్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, సిబ్బంది మరియు ఏజెంట్లు

# సర్దార్... కాంగ్రెస్‌వాడు కాదు... అందరివాడు!

- పటేల్ నాయకత్వ పటిమను ప్రపంచానికి తెలిపే ప్రయత్నం
- నెహ్రూ నాయకత్వ భ్రష్టత్వాన్ని వివరించే రాజకీయ దూరాలోచన





*నాయకుడంటే ఎలా ఉండాలి... నాయకత్వ లక్షణాలు ఏ విధంగా ఉండాలి... జాతిని సంఘటితం చేసే ధృఢనాయకత్వం ఏ రూపంలో ఉండాలి... వీటన్నింటికి రోల్‌మోడల్ "ఉక్కుమనిషి" సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్.*

భారతదేశానికి తొలిప్రధాని పటేల్ అయ్యుంటే ఈ దేశ చరిత్ర ఇంకో విధంగా ఉండేదని ఇటీవల ఢిల్లీలో జరిగిన ఓ సభలో ప్రధాని మన్మోహన్‌సింగ్ సమక్షంలోనే గుజరాత్ ముఖ్యమంత్రి, బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. అది మోడీ మాటే కాదు, దేశంలో ఈనాడు చాలామంది నోట వినిపిస్తున్న మాట కూడా! అవును దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెహ్రూ బదులు పటేల్ ప్రధాని అయ్యుంటే ఈ దేశం ఇంకోలా ఉండేదేమో! నెహ్రూ సర్దుబాటు ధోరణికి, పటేల్ ధృడనాయకత్వానికి పొంతనలేదు. ప్రతి విషయంలోనూ నెహ్రూ రాజీవైఖరిని అవలంభిస్తే, పటేల్ దేశప్రయోజనాల కోసం రాజీలేని బాటను ఎంచుకున్నాడు. వీరిద్దరి నాయకత్వ సామర్థ్యంలోని తేడాను సంస్థానాల విలీనంలోనే చూడొచ్చు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కూడా 554సంస్థానాలు ఇండియన్ యూనియన్‌లో విలీనం కాకుండా స్వతంత్రంగా వ్యవహరించసాగాయి. ఈ సంస్థానాలన్నింటిని విలీనం చేసే బాధ్యతను కేంద్రహోంమంత్రిగా పటేల్ తన భుజాలకెత్తుకున్నారు. ఒక్క జమ్మూ-కాశ్మీర్ సంస్థానం విలీనాన్ని మాత్రం నెహ్రూకు అప్పగించారు. నయానోభయానో అన్ని సంస్థానాలను పటేల్ భారత్‌లో విలీనం చేసాడు. అడ్డం తిరిగిన హైదరాబాద్ నవాబుపై సైనికచర్య జరిపి హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో కలిపారు. ఆరోజు పటేల్ గనుక ఆ సాహసం చేయకపోయివుంటే ఈరోజు భారత్‌లో హైదరాబాద్ ఒక పాకిస్థాన్ మాదిరిగా అయ్యుండేది. సంస్థానం విలీనంపై పటేల్ ఇంత సమర్థవంతంగా వ్యవహరిస్తే, కాశ్మీర్ విషయంలో నెహ్రూ మాత్రం మెతకవైఖరి అవలంభించాడు. అప్పటి కాశ్మీర్ రాజు రాజాహరిసింగ్ భారత్‌లో విలీనానికి సుముఖత చూపారు. కాని నెహ్రూకు అప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి ఒమర్‌అబ్దుల్లా తాత షేక్ అబ్దుల్లా కుటుంబంతో వున్న సన్నిహిత సంబంధాల దృష్ట్యా కాశ్మీర్‌పై మెతకవైఖరికిపోయి స్వయంప్రతిపత్తికి అంగీకరించాడు. దీంతో కాశ్మీర్ ఒక రావణకాష్టంలా మారింది. నెహ్రూ నిర్వాకం వల్లే కాశ్మీర్ ఇలా తగలబడిందనే విమర్శ ఇప్పటికీ ఉంది. అందుకే ఈరోజుకు కూడా చాలామంది నెహ్రూ బదులు పటేల్ దేశానికి తొలిప్రధాని అయ్యుంటే బాగుండేదని అంటుంటారు.

ఇప్పుడు మరోసారి ఆ ఉక్కుమనిషి దేశ రాజకీయాలలో కీలకం కాబోతున్నారు. పటేల్ వారసత్వాన్ని ఒడిసిపట్టేందుకు అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్‌పార్టీకి నెహ్రూ కుటుంబీకులు తప్పితే ఇంకెవరూ గొప్పవాళ్లుగా కనిపించరు. కాబట్టే ఇంతకాలం వాళ్లు నెహ్రూ కుటుంబ నామస్మరణతో పటేల్‌ను మరచిపోయారు. కాంగ్రెస్ వదిలేసిన పటేల్‌ను బీజేపీ, ముఖ్యంగా నరేంద్ర మోడీ పట్టుకున్నారు. ఇద్దరూ గుజరాతీలే! ఇప్పుడు పటేల్ వారసత్వాన్ని అందిపుచ్చుకునేందుకు మోడీ శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్‌కు నెహ్రూ, ఇందిర, రాజీవ్ విగ్రహాలు తప్పితే, ఇతర నేతల విగ్రహాలు పట్టవు. కాని నర్మదానది మధ్యలో సర్దార్ సరోవర్‌డ్యాంకు సమీపంలో 182మీటర్ల ఎత్తుతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సర్దార్‌వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నారు. ఉక్కుమనిషి విగ్రహాన్ని దేశవ్యాప్తంగా రైతుల నుండి వాడిపడేసిన ఇనుము వస్తువులను కరిగించి తయారు చేస్తున్నారు. ఈ మొత్తం ప్రాజెక్ట్ వ్యయం 2500కోట్లు. ఇక్కడ టూరిజం హోటళ్లు, రిసార్ట్స్, మ్యూజియం, వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు, నీటినిర్వహణ, గిరిజనాభివృద్ధి సంస్థలు వంటి వాటితో ఈ ప్రాంతాన్ని ఒక పర్యాటక కేంద్రంగా మార్చేందుకు మోడీ కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిన పటేల్ గొప్పతనాన్ని ప్రపంచానికి చూపే ప్రయత్నంలోనే మోడీ ఈ దిశగా ముందడుగు వేసాడు.

# బస్సు... బ్రతుకుల్ని బుగ్గిచేసింది



- మహబూబ్‌నగర్ జిల్లాలో బస్సు ప్రమాదం
- కల్వర్టును ఢీకొని మంటల్లో వోల్వో ...
- 45మంది ప్రయాణీకులు సజీవ దహనం
- రాష్ట్ర చరిత్రలో ఇదే అతిపెద్ద ప్రమాదం
- మృతుల్లో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే

***ఈ ప్రమాదం గురించి తలచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. అతి వేగమే ప్రమాదానికి కారణభూతమైంది. తెలవారుతుండగానే ఘోరాతి ఘోరం క్షణాల్లో జరిగిపోయింది. 45మంది అమాయకుల బతుకులు తెల్లారిపోయాయి.***

కల్వర్టును ఢీకొని డీజల్ ట్యాంక్ పేలి క్షణాల్లో మంటలు వ్యాప్తిచెందాయి. మృతుల్లో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే, రాష్ట్ర చరిత్రలో ఇదే అతిపెద్ద ప్రమాదం. పెద్ద కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం వచ్చిందని ఫోన్లో తల్లికి తియ్యటి కబురుచెప్పి సంతోషంగా ఇంటికి బయలుదేరిన యువకుడు, దీపావళి పండక్కి అత్తారింటికి బయలుదేరిన కొత్త పెళ్ళికొడుకు, పెళ్ళయిన తర్వాత పుట్టిన బిడ్డను ఎత్తుకుని గుండెకు హత్తుకుని పుట్టింటికి బయలుదేరిన ఆడపడుచు, అనారోగ్యంతో బాధపడుతున్న భర్తకు మెరుగైన వైద్య చికిత్స కోసం వెంటబెట్టుకొని హైదరాబాద్ బయలుదేరిన ఇల్లాలు... ఇలా వివిధ రకాల కారణాలతో బస్సెక్కి సంతోషంగా బయలుదేరిన అభాగ్యులు గాఢనిద్రలోకి జారుకొని విధి వక్రీకరించడంతో నిద్రలోనే మృత్యు కౌగిలికి చేరిపోయారు.

ప్రమాదానికి గురైన ఒక ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి బెంగుళూరు నగరంలో రాత్రి 10.30గంటలకు బయలుదేరి 10చోట్ల ప్రయాణీకుల్ని ఎక్కించుకుని హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ బస్సు ఉదయం 7గంటలకు గమ్యస్థానానికి చేరుకోవాల్సివుంది. జాతీయ రహదారిపై బెంగుళూరు నుంచి హైదరాబాద్ వస్తున్న వోల్వో ఏసీ బస్సు మహబూబ్‌నగర్‌జిల్లా కొత్తకోట సమీపంలో పాలెం దాటాక ఘోరరోడ్డు ప్రమాదానికి గురైంది. ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేయబోయి అక్కడ కుడి వైపునున్న కల్వర్టును బస్సు కుడి వైపు భాగం రాసుకుంటూ ముందుకు దూసుకెళ్ళడంతో డీజిల్ ట్యాంకు పగిలిపోయింది. ఈ రాపిడికి అగ్గిరవ్వలు చెలరేగి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు వ్యాపించాయి. బుధవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ప్రయాణీకులు గాఢనిద్రలో ఉన్నారు. డ్రైవరు, క్లీనరుతో బాటు క్యాబిన్‌లో కూర్చున్న ఐదుమంది ప్రాణాలతో బయటపడ్డారు. మొత్తం 45మంది సజీవ దహనం అయ్యారు. మృతుల్లో 21 మంది రాష్ట్రానికి చెందినవారు కాగా, మిగిలినవారు బెంగుళూరుకు చెందినవారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో 35మంది పురుషులు, 9 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నట్లు తేలింది. ప్రయాణీకుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమయంలో ఈ బస్సు 120కి.మీ పైగా వేగంతో ప్రయాణిస్తోంది. ప్రమాదం నుంచి బయటపడిన వారిని హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో బస్సు అగ్నిప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. కేవలం 15నిమిషాల్లో ప్రయాణీలు మాంసంముద్దలుగా మారినట్లు తెలుస్తోంది. మూడు మృతదేహాలకు ఉన్న గడియారాలు సరిగ్గా 5.15గంటలకు ఆగిపోయాయి. మృతుల్లో ప్రియాంక, రామానుజదినేష్, అమర్ మృతదేహాలను గుర్తించి పోస్టుమార్టం పూర్తిచేసి వారి బంధువులకు అప్పజెప్పారు. మిగతా 42మృతదేహాలు గుర్తించేందుకు వీలులేకుండా మాంసం ముద్దలుగా మారాయి. డీఎన్ఏ పరీక్షల ద్వారానే గుర్తించే వీలుందని డాక్టర్లు తెల్పారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల నుంచి రెండు వైద్య బృందాలు అక్కడకు చేరుకొని డీఎన్ఏ పరీక్షల నిమిత్తం మృతదేహాల నుంచి నమూనాలను సేకరించారు. అనంతరం 42మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి పంపారు.

## కంపుకొడుతున్న కోనేరు...

నెల్లూరు మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం వద్దగల కోనేరు అధ్వాన్నస్థితిలో వుంది. ఈ కోనేరు పాచిపట్టి చుట్టూ దుర్గంధం వ్యాపిస్తుంది. చెత్తా చెదారం నిండుకుంది. కార్తీకమాసంలో ఆలయం వద్ద తీవ్రరద్దీ ఉంటుంది. కోనేరు శుభ్రంగా లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడే పరిస్థితి వుంది. ఆలయాలకు సంబంధించిన కోనేర్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన నగరపాలక సంస్థ అధికారులు ఇటువైపు కన్నెత్తికూడా చూడడం లేదు. పాచి పేరుకుపోవడంతో ఇవి దోమల ఉత్పత్తికేంద్రాలుగా మారుతున్నాయి. మూలాపేట పరిసరప్రాంతాల్లో దోమల బాధపడలేక జనాలు గగ్గోలు పెడుతున్నారు. నగరపాలకసంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ కోనేరు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు 'లాయర్'కు ఈ-మెయిల్ ద్వారా తెలిపారు.




Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.